

అమరావతి అభివృద్ధి పనుల వేగాన్ని చూసి జగన్ ఓర్వలేకపోతున్నారు. ఐకానిక్ భవనాలు, సీడ్ యాక్సిస్ రోడ్లు, హైకోర్టు, సెక్రటేరియట్ నిర్మాణాలు రాత్రింబవళ్లు సాగుతున్నాయి. 30 వేల మంది కార్మికులు, ఇంజనీర్లు శ్రమిస్తున్నారు. ఆ ప్రగతిని తట్టుకోలేకనే జగన్ అసహనం వ్యక్తం చేస్తున్నారు.

**ఆలపాటి రాజేంద్రప్రసాద్,** ఎమ్మెల్సీ

శనివారం 06.06.2026

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 34 సంచిక - 45 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00

# ఆర్కిటిక్ జలమార్గం.. ఏపీకి వరం

- ఆసియా-ఐరోపా మధ్య దూరం 40 శాతం తగ్గే అవకాశం
- ఇంధనం, రవాణా ఖర్చుల్లో భారీ ఆదా: లోకేష్
- ఎరువులు, ముడి చమురు, ఎల్ఎన్‌జీరవాణాకు కొత్తమార్గం
- గ్లోబల్ లాజిస్టిక్స్ సదస్సులో ఏపీ అవకాశాలపై వివరణ



సెయింట్ పీటర్స్ బర్గ్ (రష్యా): సూయజ్ కాలువతో పోలిస్తే ఆర్కిటిక్ ఉత్తర సముద్ర మార్గం ఆసియా, ఐరోపాల మధ్య దూరాన్ని దాదాపు 40 శాతం తగ్గిస్తుంది. దీనివల్ల ప్రయాణ సమయం భారీగా తగ్గుతుందని, ఇంధనం-ఖర్చులు తగ్గి, భారత దేశానికి ఆదా అవుతుందని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. గ్లోబల్ లాజిస్టిక్స్ లో కొత్త అవకాశాలు - ఆర్కిటిక్ లో లాజిస్టిక్స్ రూపురేఖలు అనే అంశంపై సెయింట్ పీటర్స్ బర్గ్ లో జరిగిన సదస్సులో మంత్రి లోకేష్ మాట్లాడారు.

**పొడవైన తీరం..మాకు వరం :** నేను భారతదేశంలోని తూర్పుతీరం నుంచి వచ్చాను. ఆంధ్రప్రదేశ్ లో 1053 కి.మీ.లకు పైగా సుదీర్ఘ తీరప్రాంతం ఉంది. మా రాష్ట్రంలో ఇప్పటికే ఆరు ఓడరేవుల్లో సముద్రరవాణా కార్యకలాపాలు కొనసాగుతుండగా మరో 4 ప్రధాన ఓడరేవులు నిర్మాణంలో ఉన్నాయి. భౌగోళికంగా సముద్రతీర రాష్ట్రంగా ఉన్న ఏపీ ఇప్పటికే ప్రపంచంతో అనుసంధానమై మారిటైమ్ కార్యకలాపాలు కొనసాగిస్తోంది. మాకు ఆర్కిటిక్ చాలా ముఖ్యమైనది. బంగాళాఖాతం తీరంలోని ఒక రాష్ట్రానికి, ఆర్కిటిక్ గుండా వెళ్లే నౌకా మార్గానికి ఏం సంబంధం అనే ప్రశ్న మీలో ఉదయించవచ్చు. అందుకు సమాధానం వ్లాడివోస్టాక్. వ్లాడివోస్టాక్ ఉత్తర సముద్ర మార్గానికి తూర్పు కొన. ఇది, గత సంవత్సరం ప్రారంభమైన చెన్నై--వ్లాడివోస్టాక్ సముద్ర కారిడార్ ద్వారా, భారతదేశ తూర్పు తీరానికి నేరుగా అనుసంధానమైంది. విశాఖపట్నంతోపాటు మా తీరప్రాంతంలోని ఇతర ఓడరేవుల నుండి ఓడలు ఇప్పటికే 24 రోజుల పాటు వ్లాడివోస్టాక్‌కు ప్రయాణిస్తున్నాయి. వ్లాడివోస్టాక్ నుండి, ఆర్కిటిక్ కారిడార్ పశ్చిమం వైపుగా ఐరోపా వరకు మార్గం తెరిచి ఉంటుంది. ఇది భారతదేశ తూర్పు తీరాన్ని, ప్రత్యేకంగా ఆంధ్రప్రదేశ్‌ను ఈ మొత్తం వ్యవస్థలోకి సహజమైన దక్షిణ ప్రవేశ ద్వారంగా చేస్తుంది. మిగతా 2లో...

### శ్రీ సిటీలో రైలు పరిశ్రమలకు ఆహ్వానం

- ట్రాన్స్‌మాష్ హోల్డింగ్ ప్రతినిధులతో మంత్రి లోకేష్ భేటీ
- లోకోమోటివ్, బోగీల తయారీ కేంద్రం ఏర్పాటుకు విజ్ఞప్తి
- స్మార్ట్ సిగ్నలింగ్, రైల్వే ఆర్అండ్‌డీ కేంద్రాల స్థాపనకు పిలుపు

2లో

### అమరావతికి 'స్మార్ట్' మార్గదర్శకం

- సెయింట్ పీటర్స్‌బర్గ్‌తో ఉమ్మడి వర్కింగ్ గ్రూప్‌కు నిర్ణయం
- డేటా ఆధారిత నగర నిర్వహణ, డిజిటల్ సేవలపై చర్చలు
- అమరావతిని ప్రపంచ స్థాయి నగరంగా తీర్చిదిద్దడమే లక్ష్యమన్న లోకేష్

2లో

### అణుశక్తి ప్రాజెక్టులకు ఏపీ రెడీ

- రోసాటమ్‌ను రాష్ట్రంలో పెట్టుబడులకు ఆహ్వానించిన లోకేష్
- పారిశ్రామిక పార్కుల్లో డీశాలినేషన్ ప్లాంట్ల ప్రతిపాదన
- రక్షణ, ఏరోస్పేస్ రంగాలకు మిశ్రమ లోహాల తయారీ యూనిట్లపై చర్చ

2లో

## ఆక్వాకు ఏపీలో మెగా కారిడార్




- అమరావతి నుంచి నెల్లూరు వరకు 6 కేంద్రాలతో ఆక్వా ఎకోసిస్టం
- బ్లూ ఎకానమీతోనే భవిష్యత్ ఆర్థికాభివృద్ధి : సీఎం చంద్రబాబు
- సీ-ఫుడ్ ప్రాసెసింగ్, ఎగుమతులకు కొత్త ఊపు.. కేంద్రానికి పూర్తి సహకారం

**విశాఖపట్నం(జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలో ఆక్వా రంగం అభివృద్ధికి అవసరమైన ఎకోసిస్టం ఏర్పాటు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. ఆక్వా రంగానికి భారతదేశం లైట్ హౌస్‌లా ఉంటే... దానికి ఏపీని కేంద్ర బిందువు చేస్తామన్నారు. అమరావతి, భీమవరం, కాకినాడ, విశాఖపట్నం, కృష్ణపట్నం, నెల్లూరు ప్రాంతాలను కలుపుతూ ఆక్వా కారిడార్ అభివృద్ధి చేస్తామని సీఎం ప్రకటించారు. ఈ కారిడార్లో ఆక్వా అభివృద్ధికి అవసరమైన రీసెర్చ్, ఇన్నోవేషన్, స్టార్టప్స్, టెక్నాలజీని అందుబాటులోకి తెస్తామని తెలిపారు. అతి తక్కువ వ్యయంతో అత్యధిక ఉత్పత్తి సాధించడమే లక్ష్యమని చెప్పారు. మిగతా 3లో...



## జనసేన రాజ్యసభ అభ్యర్థి ఖరారు

- పవన్ కల్యాణ్ అధికారిక ప్రకటన

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ఎంతో ఉత్కంఠ రేపిన రాజ్యసభ అభ్యర్థి ఎంపికపై జనసేన పార్టీ ఎట్టకేలకు స్పష్టతనిచ్చింది. జనసేన కోటా నుంచి రాజ్యసభ అభ్యర్థిగా ప్రముఖ పారిశ్రామికవేత్త లింగమనేని రమేశ్ పేరును పార్టీ అధినేత, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అధికారికంగా ప్రకటించారు. ఆంధ్రప్రదేశ్ నుంచి ఖాళీ అయిన నాలుగు రాజ్యసభ స్థానాల పంపకాల్లో భాగంగా - 2లో...



## 50 శాతం గ్రీన్ కవర్ లక్ష్యం

- స్వచ్ఛతకు, పచ్చదనానికి ఏయూ ఆదర్శం కావాలి
- పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతన్న సీఎం చంద్రబాబు
- ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఏయూలో మొక్క నాటిన సీఎం
- స్టీల్ సిటీలో సీఎం సైకిల్ సవారీ - ఐదున్నర కి.మీ. ప్రయాణం

**విశాఖపట్నం(జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలో 50 శాతం గ్రీన్ కవర్ సాధించడమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం పని చేస్తోందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. రోజురోజుకూ పర్యావరణ సమతుల్యత దెబ్బతింటోందని... ఓవైపు విపరీతమైన ఎండలు, లేదంటే తుఫానులు వస్తున్నాయన్నారు. పర్యావరణాన్ని పరిరక్షించు కోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఆంధ్ర యూనివర్శిటీ ఇంజనీరింగ్ కాలేజ్ మిగతా 2లో...



### విశాఖకు 'బే సిటీ' బాట

- కైలాసగిరి-భోగాపురం కారిడార్ అభివృద్ధికి సీఎం ఆదేశాలు
- టూరిజం, టౌన్‌షిప్‌లు, వాటర్ స్పోర్ట్స్‌కు ప్రాధాన్యం
- బీచ్ నుంచి ఏజెన్సీ వరకూ పర్యాటక ప్రాజెక్టులపై సీఎం ఫోకస్

2లో

## కోటి మందితో 'యోగాంధ్ర'

యోగాంధ్రకు నేటి నుంచి నమోదు

- జూన్ 21 యోగా దినోత్సవం వరకు ప్రత్యేక కార్యాచరణ
- ప్రతి జిల్లాలో యోగా, క్విజ్, థీమాటిక్ కార్యక్రమాలు
- అధికారులతో ఏర్పాట్లపై సమీక్షించిన మంత్రి సత్యకుమార్

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని(జూన్ 21) పురస్కరించుకుని ఈనెల 7 నుంచి 21 వరకు ప్రత్యేక యోగా కార్యక్రమాల నిర్వహణ ఏర్పాట్లు చురుగ్గా జరుగుతున్నాయి. రాష్ట్రంలోని 28 జిల్లాల్లో కలిపి కోటి మందిని యోగాసనాల కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వీలుగా "యోగాంధ్ర-2026" పోర్టల్ ద్వారా శనివారం నుంచి రిజిస్ట్రేషన్లు జరగనున్నాయి. రాష్ట్రంలోని గ్రామ/ వార్డు సచివాలయాల ద్వారా ఈ రిజిస్ట్రేషన్లు జరుగుతాయి. ఆయుష్ శాఖకు చెందిన అధికారులను ప్రతి జిల్లాకు ఒక నోడల్ ఆఫీసర్‌గా నియమించారు. మిగతా 2లో...



## సీడ్ బాల్స్‌తో హరితాంధ్రకు శ్రీకారం



- 2.5 కోట్ల సీడ్ బాల్స్ తయారీకి శ్రీకారం
- ప్రపంచ పర్యావరణ దినోత్సవ వేడుకల్లో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** పర్యావరణ పరిరక్షణలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 2.5 కోట్ల సీడ్ బాల్స్ తయారీ కార్యక్రమానికి ఉప ముఖ్యమంత్రి, అటవీ పర్యావరణ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ శ్రీకారం చుట్టారు. ఎన్టీఆర్ జిల్లా మూలపాడులోని బటర్‌ఫ్లై పార్కులో శుక్రవారం నిర్వహించిన ప్రపంచ పర్యావరణ దినోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ప్రజా ప్రతినిధులు, అధికారులు, స్వయం సహాయక సంఘాల మహిళలు, విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో కలిసి పవన్ కళ్యాణ్ స్వయంగా సీడ్ బాల్స్ తయారు చేశారు. అంకుడు, తెల్ల పొణికి, వేప, కుంకుడు, రావి, మర్రి, వెదురు, ఉసిరి, చింత, మోదుగ వంటి స్వదేశీ జాతుల విత్తనాలతో సీడ్ బాల్స్ రూపొందించారు.

రాష్ట్రంలోని సుమారు 300 ప్రాంతాల్లో సీడ్ బాల్స్ తయారీ కార్యక్రమం నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. మూలపాడు నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న కార్యక్రమాన్ని పరిశీలించిన పవన్ కళ్యాణ్, సీడ్ బాల్స్ తయారీలో పాల్గొన్న వారితో మాట్లాడారు. వన సంరక్షణకు స్ఫూర్తినిచ్చిన మహనీయుల ఆశయాలను కొనసాగిస్తూ ఈ కార్యక్రమాన్ని బాధ్యతగా నిర్వహించాలని సూచించారు. మిగతా 3లో...

## కార్పొరేట్ స్థాయిలో బీసీ హాస్టళ్లు



- పనితీరు ఆధారంగా బీసీ హాస్టళ్లకు గ్రేడింగ్
- గ్రేడింగ్ ఆధారంగానే బదిలీలు, పదోన్నతులు
- త్వరలో 1,291 పారిశుధ్య సిబ్బంది, 142 కుక్-కమాటీల నియామకం
- 224 మంది వీఆర్వోలు, మహిళా పోలీసుల డిప్యూటేషన్
- 6 ఎంజేపీ పాఠశాలలు జూనియర్ కళాశాలలుగా అప్‌గ్రేడ్
- ఐఐటీ, నీట్ శిక్షణకు రెండు ఎక్స్‌లెన్స్ సెంటర్లు
- వార్డెన్లు, ప్రిన్సిపాళ్లతో మంత్రి సవిత వీడియో కాన్ఫరెన్స్

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలోని బీసీ హాస్టళ్లు, గురుకులాలను పకడ్బందీగా నిర్వహించి వాటి పనితీరు ఆధారంగా గ్రేడింగ్ ఇవ్వనున్నట్లు బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత తెలిపారు. బోధన, మెనూ అమలు, పరిశుభ్రత, పరిపాలన తదితర అంశాల ఆధారంగా ఈ గ్రేడింగ్ ఉంటుందని, భవిష్యత్తులో వార్డెన్లు, ప్రిన్సిపాళ్ల బదిలీలు, పదోన్నతుల్లో దీనికి ప్రాధాన్యం మిగతా 3లో...

## ముంబయిలో 'తెలుగు భవనం'కు కృషి




- తెలుగు రాష్ట్రాల సంయుక్త ఆధ్వర్యంలో సాంస్కృతిక వేదిక ఏర్పాటుకు హామీ
- భాష, యాస, సంప్రదాయాలను భావితరాలకు అందించాలి
- ముంబయి తెలుగు సంఘాల సేవలు స్ఫూర్తిదాయకం
- తెలుగు ఆడిటోరియం అభివృద్ధికి ప్రభుత్వ సహకారం : మంత్రి కందుల దుర్గేష్

3

## గిరిజనులకు ప్రకాశవంత భవిష్యత్



- గిరిజన విద్యాభివృద్ధికి ప్రభుత్వం పూర్తి కట్టుబాటు
- ప్రతిభ కనబరిచిన విద్యార్థులు, ఉపాధ్యాయులకు ఘన సత్కారం
- 176 మంది మెరిట్ విద్యార్థులు, అధ్యాపకులకు పురస్కారాలు

## సీడ్ బాల్స్‌తో హరితాంధ్రకు శ్రీకారం



(మొదటి పేజీ తరువాయి)

జూన్ 15 నాటికి 2.5 కోట్ల సీడ్ బాల్స్ తయారు చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. అనంతరం డ్రోన్ల సహాయంతో కొండ ప్రాంతాల్లో విత్తన బంతులు వెదజల్లే ప్రక్రియను పరిశీలించారు.

**ప్రతి ఎకో పార్కులో యోగా హాల్ :** మూలపాడు బటర్‌ఫ్లై పార్కులో అటవీ శాఖ ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను సందర్శించిన పవన్ కళ్యాణ్, పార్కులో నిర్మించిన యోగా హాల్‌ను పరిశీలించారు. రాష్ట్రంలోని ప్రతి ఎకో టూరిజం పార్కులో యోగా హాల్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.

అనంతరం కొండపల్లి కొయ్య బొమ్మల తయారీకి ఉపయోగించే తెల్ల పొణికి దుంగలను పరిశీలించారు. కళాకారులు రూపొందించిన వివిధ కళాకృతులను తిలకించారు. చెక్క ఉత్పత్తుల తయారీకి అవసరమైన ముడి సరుకు అందుబాటులో లేకపోవడంపై కళాకారులు వివరించగా, వుడ్ బ్యాంక్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.

కొయ్య బొమ్మల కళాకారులతో ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, హైదరాబాద్ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు ప్రతిమను తయారు చేయించాలని సూచించారు. కళాకారుల ఉత్పత్తులకు మార్కెటింగ్, ప్రచారం కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రతి రెండు నెలలకు ఒక ప్రాంతంలో చేతివృత్తుల కళాకారులతో సమావేశాలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.

కార్యక్రమంలో మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్, అటవీ పర్యావరణ శాఖ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే, పీసీసీఎఫ్ పీవీ చలపతిరావు, అటవీ శాఖ సలహాదారు మల్లికార్జునరావు, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ, జనసేన ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు సామినేని ఉదయభాను, మైలవరం ఇన్‌చార్జి అక్కల రామ్మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల భాగస్వామ్యంతో స్కూల్ కాంపౌండ్ వాల్ నిర్మాణం



**తెనాలి(జర్నలిస్ట్ ఫైల్):** మండలంలోని సంగం జాగర్లమూడి లోని శ్రీ కొత్త వెంకయ్య చౌదరి మెమోరియల్ జిల్లా పరిషత్ హై స్కూల్ కాంపౌండ్ వాల్ నిర్మాణం పనుల శంకుస్థాపన కార్యక్రమం స్కూల్ పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో నిర్వహించారు. కేంద్ర టెలి కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ఎంపీ లార్డ్స్ నుండి 20 లక్షల రూపాయలు అలాగే ఐటిసి వారి జూ= ఫండ్స్ 20 లక్షల రూపాయలు కాంపౌండ్ వాల్ నిర్మాణం కొరకు సాంక్షన్ చేయడం జరిగిందని పూర్వ విద్యార్థులు తెలియజేశారు. ఐటిసి వారు నిర్మించే కాంపౌండ్ వాల్ నిర్మాణంలో 20% ఈ స్కూలు పూర్వ విద్యార్థులు భాగస్వామ్యంతో నిర్మించటం జరుగుతున్నదని వారు తెలిపారు. అనంతరం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని స్కూల్ ఆవరణలో ఐటీసీ వారి ఆధ్వర్యంలో మొక్కల నాటే కార్యక్రమం క చేపటారు. కార్యక్రమం లో ఐటీసీ వారు, పాఠశాల పూర్వ విద్యార్థులు స్కూలు ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# ఆక్వాకు ఏపీలో మెగా కారిడార్



(మొదటి పేజీ తరువాయి)

ఆక్వా ఉత్పత్తులకు సంబంధించిన ఉప ఉత్పత్తులతో కూడా ఆర్థిక ప్రగతి సాధించవచ్చన్నారు. శుక్రవారం విశాఖలో జరిగిన సీ-ఫుడ్ ఎగుమతుల జాతీయ వర్క్ షాప్‌లో ప్రసంగించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 'ఆంధ్రా ష్రింప్, ఇండియా సీ-ఫుడ్' బ్రాండ్ ఎస్టాబ్లిష్ చేస్తున్నామని చెప్పారు. ఆక్వా రంగ అభివృద్ధికి చర్యలు తీసుకోవాల్సిన నాలుగు శాఖలకు చెందిన కేంద్ర మంత్రులు ఒకే వేదికపై రావడం శుభపరిణామంగా అభివర్ణించారు.

**రాష్ట్రంలో మెగా సీ-ఫుడ్ ప్రాసెసింగ్ పార్కులు :** 'రూ. 72 కోట్లతో కాకినాడ పోర్ట్ మోడ్రనైజేషన్ చేపడతామని కేంద్ర మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ ప్రకటించినందుకు సంతోషం. కేంద్ర మత్స్య శాఖకు ప్రాంతీయ కార్యాలయానికి అవసరమైన స్థలాన్ని 15 రోజుల్లో కేటాయిస్తాం. నెల రోజుల్లో కార్యాలయానికి శంకుస్థాపన చేసి నిర్మాణం ప్రారంభించాలని కేంద్రాన్ని కోరుతున్నాను. ఆక్వా ఉత్పత్తులను మరింత పెద్ద స్థాయిలో ఎగుమతులు చేసేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. ఆక్వా రంగ అభివృద్ధికి కేంద్రం తీసుకునే చర్యలకు రాష్ట్రం వైపు నుంచి పూర్తి సహకారం ఉంటుంది. మెగా సీ-ఫుడ్ ప్రాసెసింగ్ పార్కుల ఏర్పాటుకు కేంద్రం సహకరిస్తామని ఇప్పటికే చెప్పింది. వికసిత్ భారత్ లక్ష్యాలు చేరుకోవడానికి బ్లూ ఎకానమీ ఎంతో కీలకం. పాండ్ టు పోర్టు, ఫార్మర్ టు గ్లోబల్ కన్స్యూమర్, బ్లూ ఎకానమీ టు వికసిత్ భారత్ అనే విధానంతో పని చేయాలి. భారత ఆశలను... ఆశయాలను నెరవేర్చేందుకు ఏపీ బ్లూ ఎకానమీ దోహదపడుతుందని భావిస్తున్నా. ప్రపంచ వ్యాప్తంగా జరిగే సీ-ఫుడ్ బిజినెస్‌లో ఇండియా వాటా కేవలం 5 శాతం మాత్రమే ఉంది. ఈ రంగంలో ఇండియాకు పెద్దఎత్తున అవకాశాలు ఉన్నాయి.' అని ముఖ్యమంత్రి అన్నారు.

**ఏటా రూ.28,000 కోట్ల ఎగుమతులు :** 'భవిష్యత్ అంతా బ్లూ ఎకానమీదే. బ్లూ ఎకానమీ ద్వారా ఆర్థిక వృద్ధి సాధ్యం. నీరు ఉన్న చోట నాగరికతలు విలసిల్లుతాయి... ఏపీలో గోదావరి, కృష్ణ వంటి జీవ నదులు ఉన్నాయి. సీ-ఫుడ్ ఉత్పత్తిలో ఏపీ రెండో అతి పెద్ద రాష్ట్రం. 197 లక్షల మెట్రిక్ టన్నుల సీ-ఫుడ్ ఉత్పత్తి ఏపీలో జరుగుతోంది. ఏపీలో బ్లూ ఎకానమీ పెరిగితే... దేశ ప్రగతికి దోహద పడుతుంది. భారతదేశం మొత్తం చేపల ఉత్పత్తిలో ఏపీ వాటా 28 శాతంగా ఉంది. భారతదేశం మొత్తం రొయ్యల ఉత్పత్తిలో ఏపీ షేర్ 66 శాతం. భారతదేశం మొత్తం సముద్ర ఆహార ఎగుమతుల్లో దాదాపు ఏపీ నుంచే 38 శాతం ఆదాయం వస్తోంది. సంవత్సరానికి రూ. 28,000 కోట్లకు పైగా సముద్ర ఆహార ఎగుమతులు ఏపీ నుంచే జరుగుతున్నాయి. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి చెందితే, భారతదేశ సముద్ర ఆహార ఎగుమతులు కూడా అభివృద్ధి చెందుతాయి. ఆక్వా రంగంలో ఆంధ్రప్రదేశ్ ఆవిష్కరణలు చేస్తే, భారతదేశ బ్లూ ఎకానమీ నిస్సందేహంగా ముందుకు సాగుతుంది. ఏపీలో 1,053 కిలోమీటర్ల తీర ప్రాంతం ఉంది. ఏపీకి పోర్టులు, ఎయిర్ పోర్టులు ఉన్నాయి. ఏ రంగం, ఏ ఉత్పత్తి అయినా సక్సెస్ కావాలంటే క్వాలిటీ, సస్టైనబుల్టీ, ట్రేసబులిటీ, ఇన్నోవేషన్, జీరో పొల్యూషన్ అనేది ముఖ్యం. సీ-ఫుడ్ ఎగుమతుల అభివృద్ధికి ప్రతీ స్టేక్ హోల్డర్ బాధ్యత తీసుకోవాలి, సహకరించాలి.' అని సీఎం అన్నారు.

**ప్రధాని మోదీని మరింత బలపరుద్దాం :** 'ఆక్వా పరిశ్రమలో ఇన్నోవేషన్లు చేసే వారిని ఆంధ్రప్రదేశ్ ఆహ్వానిస్తోంది. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానంతో ఏపీ పని చేస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెడితే.. ఆ పెట్టుబడులకు ప్రోత్సాహమిచ్చి... అభివృద్ధి చేస్తాం. ఆక్వా ఉత్పత్తులతో చక్కటి ఆరోగ్యం లభిస్తుంది. ప్రజలు ఇప్పుడు ప్రొటీన్ ఉత్పత్తులనే ఆహారంగా తీసుకుంటున్నారు. ఆక్వా ఉత్పత్తుల్లో ప్రొటీన్ పుష్కలంగా ఉంటుంది. ప్రొటీన్ ఫుడ్ తీసుకోవడంతోపాటు... ప్రతీ రోజూ సైకిలింగ్ చేయాలి. ఇవాళ ఈ సమావేశానికి సైకిలింగ్ చేసుకుంటూనే వచ్చాను. సైకిలింగ్ ద్వారా ఆరోగ్యం బాగుంటుంది... ఖర్చులూ తగ్గుతాయి. సోలార్ విద్యుత్ ఉత్పత్తికి అధిక ప్రాధాన్యమిస్తున్నాం. సరైన సమయంలో సరైన నేత నరేంద్ర మోదీ ప్రధానిగా ఉండటం అదృష్టం. 21వ శతాబ్దం నరేంద్ర మోదీదే... భవిష్యత్తులో భారత దేశాన్ని అగ్ర భాగంలో నిలపడానికి ప్రధాని మోదీ అద్భుతంగా పని చేస్తున్నారు. ప్రధానిగా 12 ఏళ్లు పూర్తి చేసుకుంటున్న మోదీని మరింత బలపర్చాల్సిన అవసరం ఉంది.' అని సీఎం చెప్పారు.

**కొత్త మార్కెట్లకు భారత ఆక్వా ఉత్పత్తులు :** ఆక్వా రంగం అభివృద్ధిపై కేంద్ర మంత్రులతో కలిసి ముఖ్యమంత్రి చంద్రబాబు ఉమ్మడి ప్రెస్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆక్వా రంగం విషయంలో కేంద్ర ప్రభుత్వం సంక్షోభం నుంచి అవకాశాలను అన్వేషిస్తోందని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చెప్పారు. అమెరికా టారిఫ్‌లు విధించినప్పటికీ... గతేడాది కంటే మిన్నగా ఆక్వా ఎగుమతులు చేసుకోగలిగామని, అంతర్జాతీయంగా కొత్త మార్కెట్లకు భారత ఆక్వా ఎగుమతులు వెళ్లాయన్నారు. ఇప్పుడు మన ఆక్వా ఉత్పత్తులకు మరిన్ని మార్కెట్లు అందుబాటులోకి వచ్చాయన్నారు. ఆక్వా ఎగుమతులతో ఆర్థికాభివృద్ధితో పాటు.. మత్స్యకారులకు చాలా ఉపయోగపడుతుందన్నారు. మోడ్రనైజ్డ్ బోట్లను మత్స్యకారులకు అందించడానికి సిద్ధంగా ఉన్నామని, 200 మోడ్రనైజ్డ్ బోట్లు ఏపీకి వస్తున్నాయని చెప్పారు. ప్రజల ఆహార అలవాట్లు మారాయని, ప్రొటీన్ ఆహారాన్ని అధికంగా తీసుకుంటున్నారని... దీంతో ప్రొటీన్ ఎక్కువ ఉండటం వల్ల ఆక్వా ఉత్పత్తులకు రోజు రోజుకూ డిమాండ్ పెరుగుతోందన్నారు.

**సీ-ఫుడ్ ప్రాసెసింగ్‌లో విస్తృత అవకాశాలు :** ప్రెస్ కాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి మాట్లాడుతూ...'ఆక్వాలో కేవలం 12 శాతం మాత్రమే ప్రాసెసింగ్ చేస్తున్నాం... సీ-ఫుడ్ ప్రాసెసింగ్ విషయంలో మరింత అభివృద్ధి చేయాలి. ఆక్వాలో టెక్నాలజీ, ఇన్నోవేషన్లకు పెద్ద పీట వేయాలి. వ్యవసాయంతో పోల్చుకుంటే ఆక్వాలో ఎక్కువ అభివృద్ధి కనిపిస్తోంది. ఆక్వాకు రూ. 1.50కే విద్యుత్ ఇస్తున్నాం. ఫిష్ ఫీడ్ ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. ఫిష్ మీల్ ఎగుమతులను 50 శాతానికి పరిమితం చేయాలని కోరుతున్నాం. సోయా విషయంలోనూ కేంద్రం నుంచి సహకారం అవసరం. ఇతర దేశాలతో ఫ్రీ ట్రేడ్ అగ్రిమెంట్లు జరగాల్సి ఉంది.. దీనికి కేంద్రం ఇప్పటికే సహకరిస్తోంది. ప్రపంచంలోని ప్రతీ కిచెన్‌లోకి ఇండియన్ ఆక్వా ఉత్పత్తులు వెళ్లేలా కేంద్రం ప్రణాళికలు రూపొందించడం సంతోషంగా ఉంది.' అని అన్నారు.

**సర్క్యులర్ ఎకానమీతో 'ఆక్వా' అనుసంధానం :** 'పీఎంఎంకేఎస్ఎస్‌వై (గ్రావీవీఖూష్) పథకాన్ని ఏపీలో అమలు చేస్తాం... విశాఖ ఫిషింగ్ హార్బర్‌లో సమస్యలు ఉంటే పరిష్కరిస్తాం... ఏడాది 30 బిలియన్ యూఎస్ డాలర్ల విలువైన ఎగుమతులు చేసేలా కేంద్ర ప్రభుత్వ లక్ష్యం పెట్టుకుంది. కేంద్రం నిర్దేశించుకున్న లక్ష్యంలో 30 శాతం ఏపీ వాటా ఉంటుందని హామీ ఇస్తున్నాం. సర్క్యులర్ ఎకానమీకి ఆక్వా రంగాన్ని అనుసంధానం చేసేలా భీమవరంలో ప్రాజెక్టులకు కేంద్రం సహకారం అందిస్తోంది. మార్కెట్ ఇబ్బందులతో మద్దతు ధర కోల్పోయిన వివిధ పంటల రైతులను ఆదుకోవాలని కేంద్రాన్ని కోరుతున్నాం. ప్రపంచవ్యాప్తంగా భారత దేశానికి గౌరవం దక్కడానికి కారణం ప్రధాని నరేంద్ర మోదీనే. చాలా దేశాల్లో చాలా ఇబ్బందులు, సమస్యలు ఉన్నాయి... భారత దేశాన్ని ప్రధాని సమర్థవంతంగా నడిపిస్తున్నారు. సూర్య ఘర్, పీఎం కుసుమ్ వంటి వాటిని కేంద్రం ప్రోత్సహిస్తోంది. అమెరికాలో నాలుగు పవర్ గ్రిడ్లు ఉన్నాయి... భారత దేశంలో ఒకే సెంట్రల్ పవర్ గ్రిడ్ ఉంది. భారత దేశంలో ఏ మారుమూల విద్యుత్ ఉత్పత్తి చేసినా... కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు ఎక్కడైనా వినియోగించుకునే అవకాశం ఉంది. ఈ పరిణామాలన్నీ 2014 తర్వాతే జరిగాయి. గతంలో సోలార్ విద్యుత్ యూనిట్‌కు ఉత్పత్తి వ్యయం రూ. 14గా ఉండేది.. ఇప్పుడు యూనిట్‌కు రూ. 2.40కు వ్యయం తగ్గింది. గతంలో సోలార్ ప్యానెళ్లను దిగుమతి చేసుకోవాల్సి వచ్చేది.. కానీ ప్రధాని మోదీ నిర్ణయాలతో ఇప్పుడు ఏపీలో సోలార్ ప్యానెళ్లు ఉత్పత్తి చేసుకుంటున్నాం.' అని అన్నారు.

# కార్పొరేట్ స్థాయిలో బీసీ హాస్టళ్లు

(మొదటి పేజీ తరువాయి)

కల్పిస్తామని వెల్లడించారు.

నూతన విద్యా సంవత్సరం ఈ నెల 12న ప్రారంభం కానున్న నేపథ్యంలో శుక్రవారం సచివాలయం నుంచి అన్ని జిల్లాల హాస్టల్ వార్డెన్లు, ఎంజేపీ గురుకులాల ప్రిన్సిపాళ్లు, అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. విద్యార్థులకు పరిశుభ్రమైన వాతావరణం కల్పించేందుకు హాస్టళ్లు, గురుకులాల పరిసరాలు, తరగతి గదులు, విశ్రాంతి గదులు, మరుగుదొడ్లు పూర్తిస్థాయిలో శుభ్రం చేయాలని ఆదేశించారు. తాగునీటి సదుపాయాలు, ఆర్వో ప్లాంట్లు, దోమతెరల ఏర్పాటు వంటి అంశాలను వెంటనే పూర్తి చేయాలని సూచించారు.

**1,291 పారిశుధ్య సిబ్బంది :** హాస్టళ్లు, గురుకులాల్లో పారిశుధ్య నిర్వహణకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి తెలిపారు. ఈ క్రమంలో త్వరలోనే 1,291 పారిశుధ్య సిబ్బంది నియామకం చేపట్టనున్నట్లు చెప్పారు. విద్యార్థుల ఆరోగ్య రక్షణ కోసం విద్యా సంవత్సరం ప్రారంభంలోనే ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని అధికారులకు సూచించారు.

**142 కుక్‌లు, కమాటీలు :** ప్రభుత్వం నిర్దేశించిన మెనూను సమర్థంగా అమలు చేసి నాణ్యమైన ఆహారం అందించేందుకు 142 కుక్, కమాటీ పోస్టులను భర్తీ చేయనున్నట్లు తెలిపారు. ఖాళీలున్న హాస్టళ్ల అవసరాలను బట్టి నియామకాలు చేపడతామని పేర్కొన్నారు. అదేవిధంగా 126 మంది వీఆర్వోలు, 98 మంది మహిళా పోలీసులతో కలిపి 224 మందిని డిప్యూటేషన్‌పై హాస్టళ్లకు కేటాయించనున్నట్లు వెల్లడించారు.

**ఆరు ఎంజేపీలు జూనియర్ కళాశాలలుగా :** ఆత్మకూరు, వనిపెంట, నరసన్నపేట, గొలగమూడి, కొత్తవలస, కలికిరి ఎంజేపీ పాఠశాలలను జూనియర్ కళాశాలలుగా అప్‌గ్రేడ్ చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. కొత్త విద్యా సంవత్సరం నుంచే ఇంటర్ తరగతులు ప్రారంభించనున్నట్లు చెప్పారు.

**ఐఐటీ, నీట్‌కు ప్రత్యేక శిక్షణ :** బీసీ విద్యార్థుల ఉన్నత విద్యకు ప్రోత్సాహంగా రెండు ఎక్సలెన్స్ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. వీటి ద్వారా 1,400 మంది విద్యార్థులకు ఐఐటీ, నీట్ ప్రవేశ పరీక్షలకు ప్రత్యేక శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. మరో పది ఎంజేపీ పాఠశాలల ఏర్పాటుకు కూడా ప్రతిపాదనలు పంపినట్లు చెప్పారు. హాస్టళ్లు, గురుకులాల నిర్వహణలో ఎలాంటి ఆరోపణలు, అవకతవకలకు అవకాశం ఇవ్వొద్దని మంత్రి సవిత హెచ్చరించారు. బీసీల విద్యాభివృద్ధికి కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని, నిధుల కేటాయింపులో ఎలాంటి లోటు ఉండదని స్పష్టం చేశారు. విద్యార్థులను కంటికి రెప్పలా చూసుకుంటూ ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేయాలని అధికారులకు సూచించారు.

## పండ్ల తోటలకు ప్రోత్సాహం



బ్రహ్మంగారిమఠం (జర్నలిస్ట్ ఫైల్): బ్రహ్మంగారి మఠం మండలంలో సన్న కారు రైతులకు దీర్ఘకాలిక ఆదాయం అందించే లక్ష్యంతో ప్రభుత్వం పండ్ల తోటలు చీనీ, జామ, సపోటా నేరేడు, సీతాఫలం పండ్ల తోటల పెంపకాన్ని ప్రోత్సహిస్తుంది. నీటి వనరులు పరిమితంగా ఉన్నప్పటికీ వాటిని సమర్థవంతంగా వినియోగించుకుంటూ ఉద్యాన పంటల సాగును విస్తరించేందుకు ప్రత్యేక కార్యచరణ చేపట్టింది. ఉపాది హామీ పథకాన్ని అనుసంధానం చేస్తూ 100 శాతం రాయితీ కల్పిస్తూ కూడిన చిన్న సన్నకారు రైతులకు విశేష ప్రయోజనం కల్పించనున్నారు. రైతులు సాంప్రదాయ పంటలతో పాటు ఆదాయం వచ్చే పండ్ల తోటలను అభివృద్ధి చేసుకునేందుకు ప్రభుత్వం అన్ని విధాల చేయూత అందించనుంది. దీర్ఘకాలిక ఆరాయ వనరులను సృష్టించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్టు ఏపీవో హరికృష్ణ తెలిపారు. 5 ఎకరాల పొలం ఉండాల్సిందే, పండ్ల పంటల రకాలను బట్టి మూడేళ్ల కాల వ్యవదిలో 90 వేల నుండి లక్ష రూపాయల వరకు ప్రభుత్వం సాయం అందించనుంది.. సన్నకారు రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు తెలిపారు.

# ముంబయిలో 'తెలుగు భవనం'కు కృషి

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** మూడు రోజుల కేరళ పర్యటనను దిగ్విజయంగా ముగించుకుని ముంబయి చేరుకున్న మంత్రి కందుల దుర్గేష్ ముంబయి ఆంధ్ర మహాసభ మరియు జింఖానా సంయుక్తంగా నిర్వహించిన "తెలుగు సాంస్కృతిక సంబరాలు-2026"లో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సభా నిర్వాహకులు, కార్యవర్గ సభ్యులు మంత్రిని ఘనంగా సత్కరించారు. మూడు రోజుల ఉత్సవాల్లో భాగంగా తొలిరోజు ముంబయిలోని సియాన్ లో ఉన్న శ్రీ షణ్ముఖానంద చంద్రశేఖరేంద్ర సర్వసతి ఆడిటోరియంలో స్థానిక తెలుగు సంఘాలను ఉద్దేశించి మంత్రి దుర్గేష్ ప్రసంగిస్తూ.. ఎందరో మహానుభావులను కన్న తెలుగునేల వైభవాన్ని స్మరిస్తూ, పరాయి ప్రాంతాల్లో స్థిరపడినప్పటికీ మన భాష, యాస, ఆచార వ్యవహారాలను భవిష్యత్ తరాలకు అందిస్తున్న ముంబయి తెలుగు సంఘాల కృషి స్ఫూర్తిదాయకమని కొనియాడారు. ఈ సందర్భంగా నిడదవోలుకు చెందిన చిన్నారి నదియ ప్రదర్శించిన కూచిపూడి నృత్యాన్ని, అలాగే మహారాష్ట్ర ప్రత్యేక గీతానికి చేసిన తెలుగు ప్రాంతానికి చెందిన చిన్నారులు ప్రదర్శించిన నృత్య రూపకాన్ని అభినందిస్తూ.. స్థానిక సంస్కృతితో సమన్వయం సాధించడం గర్వకారణమన్నారు. ఎక్కడున్నా మన మూలాలను మరువకూడదని హితవు పలికారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలుగా విడిపోయినప్పటికీ తెలుగువారంతా సోదరులేనని, తెలుగు వారిలో ఐకమత్యం లేదనే భావనను తొలగించి, భాషా పరంగా మనమంతా ఒక్కటేనని చాటిచెప్పారు. హిందీ, ఇంగ్లీష్ భాషలతో పాటు మాతృభాష నేర్చుకోవడం తప్పనిసరి అని చెప్తూ, ఈ తరం పిల్లలకు తెలుగు రాయడం, చదవడం, మాట్లాడటం నేర్పించాలన్నారు. ఇందుకోసం కూటమి ప్రభుత్వం ఏపీలో ప్రాథమిక స్థాయిలో తెలుగు మాధ్యమ బోధనను నిబంధనగా తెచ్చిందని గుర్తుచేశారు. ప్రపంచంలో ఒక్క తెలుగు భాషలోనే పద్యనాటక ప్రక్రియ సజీవంగా ఉందన్న మంత్రి దుర్గేష్ దాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. పర్యాటక, సాంస్కృతిక మంత్రిగా తెలుగు రాష్ట్రాల సంయుక్త ఆధ్వర్యంలో ఒక "తెలుగు భవనం" ఏర్పాటుకు కృషి చేస్తానని, అందులో తెలుగు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించుకునే వీలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. అలాగే ముంబయిలోని తెలుగు ఆడిటోరియం అభివృద్ధికి, ముంబయి ఆంధ్ర మహాసభ నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాలకు ఏపీ సాంస్కృతిక శాఖ తరపున సంపూర్ణ సహకారం అందిస్తామని ప్రకటించారు. చివరగా, ది ముంబయి ఆంధ్ర మహాసభ, జింఖానా అధ్యక్షులు కొండారెడ్డిని, వారి కార్యవర్గాన్ని కార్యక్రమాన్ని ఇంత విజయవంతంగా నిర్వహించినందుకు మంత్రి దుర్గేష్ ప్రత్యేకంగా అభినందించారు.

కార్యక్రమంలో తెలంగాణ మీడియా అకాడమీ ఛైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి, సింగర్ గజల్ శ్రీనివాస్, ముంబయి ఆంధ్ర మహాసభ మరియు జింఖానా నిర్వాహకులు, స్థానిక తెలుగు ప్రజలు పాల్గొన్నారు.

## ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పిలుపు మేరకు మంగళగిరిలో సైకిల్ ర్యాలీ నిర్వహణ



**మంగళగిరి(జర్నలిస్ట్ ఫైల్):** ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించే లక్ష్యంతో ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపు మేరకు గురువారం మంగళగిరిలో భారీ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. మంగళగిరి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయం డా. ఎంఎస్ఎస్ భవన్ నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ గౌతమ బుద్ధ రోడ్, ఆల్ఫా సెంటర్ మీదుగా తిరిగి పార్టీ కార్యాలయానికి చేరుకుంది.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణ అనేది కేవలం ప్రభుత్వాల బాధ్యత మాత్రమే కాకుండా ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు. పెరుగుతున్న కాలుష్యం, వాతావరణ మార్పుల ప్రభావాన్ని తగ్గించేందుకు చెట్ల పెంపకం, సైకిల్ వినియోగం వంటి పర్యావరణ హిత చర్యలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు.

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యావరణ పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారని, రాష్ట్రాన్ని హరితాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతోందని తెలిపారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కను నాటి, దాని సంరక్షణ బాధ్యతను స్వీకరించాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువత మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# గిరిజనులకు ప్రకాశవంత భవిష్యత్

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** గిరిజన విద్యార్థుల్లో ఉన్న భయం, బిడియం, సంకోచాలను విడిచిపెట్టి ధైర్యంగా ముందుకు సాగి ఐఏఎస్, ఐపీఎస్ వంటి అత్యున్నత స్థాయి ఉద్యోగాలను అధిరోహించాలని గిరిజన సంక్షేమ, మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి పిలుపునిచ్చారు.

గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం మార్చి 2026 లో నిర్వహించిన ఎస్సెస్సీ (పదో తరగతి) మరియు ఇంటర్మీడియట్ పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను, వారికి దిశానిర్దేశం చేసిన ఉపాధ్యాయులను స్థానిక తుమ్మల పల్లి కళా క్షేత్రంలో ఘన సత్కార కార్యక్రమాన్ని నిర్వహించారు.. ఈ కార్యక్రామానికి ముఖ్య అతిధిగా గిరిజన సంక్షేమ, మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి హాజరై మాట్లాడుతూ... ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ప్రభుత్వం గిరిజన విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రతి విద్యార్థిపై దాదాపు రూ. లక్ష వరకు వ్యయం చేస్తూ నాణ్యమైన విద్యతో పాటు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలిపారు. విద్యార్థులు కూడా ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను అందిపుచ్చుకుని జీవితంలో అత్యున్నత స్థాయికి చేరుకోవాలన్నారు. 'తల్లికి వందనం' పథకంతో పాటు యూనిఫారాలు, బూట్లు, పుస్తకాలు, ట్రంక్ బాక్సులు, బెడ్‌షీట్లు తదితర అవసరాల కోసం ప్రత్యేక నిధులు కేటాయిస్తున్నామన్నారు.

టెన్త్, ఇంటర్ పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందించిన మంత్రి, 600 మార్కులకు గాను 591 మార్కులు సాధించిన పార్థు, 590 మార్కులు సాధించిన జాస్మిన్ వంటి విద్యార్థులు గిరిజన సమాజానికి ఆదర్శంగా నిలవడంతోపాటు తోటి విద్యార్థులకు స్ఫూర్తిగా నిలిచారన్నారు. 90 శాతానికి పైగా మార్కులు సాధించిన విద్యార్థులందరికీ ప్రత్యేక అభినందనలు తెలిపారు. విద్యార్థులు మొబైల్ ఫోన్లకు పరిమితం కాకుండా క్రీడలు, శారీరక వ్యాయామం, వ్యక్తిత్వ వికాసంపై దృష్టి పెట్టాలని సూచించారు. గంజాయి, బెట్టింగ్ వంటి దురలవాట్లకు, ఆత్మహత్యలు వంటి క్షణికావేశ నిర్ణయాలకు దూరంగా ఉండాలని హితవు పలికారు. తల్లిదండ్రుల సూచనలు పాటిస్తూ సరైన మార్గంలో పయనించాలని కోరారు.



గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని, గిరిజన గ్రామాల్లో రహదారి సౌకర్యాల కోసం రూ. 2,500 కోట్లు కేటాయించామని తెలిపారు. గతంలో గంజాయి సాగు జరిగిన ప్రాంతాల్లో దానిని పూర్తిగా నిర్మూలించి, సుమారు రెండు లక్షల ఎకరాల్లో కాఫీ సాగును ప్రోత్సహించడం ద్వారా గిరిజనులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని చెప్పారు. గత ప్రభుత్వంలో విస్మరించిన పథకాలైన గిరిజన రైతులకు 90 శాతం సబ్సిడీతో విత్తనాలు, టార్పాలిన్లు, ఆయిల్ ఇంజిన్లు, ట్రాక్టర్లు అందజేస్తున్నామని వెల్లడించారు.

పల్నాడు జిల్లా ఎత్తిపోతల ఆశ్రమ పాఠశాల విద్యార్థినులు పాములను ముందుగానే గుర్తించే 'ప్రోటోటైప్ షూ' రూపొందించి రాష్ట్రస్థాయి అవార్డు సాధించడం గర్వకారణమని మంత్రి పేర్కొన్నారు. వారి సృజనాత్మకతను అభినందిస్తూ, భవిష్యత్తులో రైతుల భద్రతకు ఉపయోగపడేలా ఇలాంటి ఆవిష్కరణలను ప్రోత్సహిస్తామని హామీ ఇచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ప్రతి ఒక్కరూ తమ తల్లి పేరుతో ఒక మొక్కను నాటి సంరక్షించాలని పిలుపునిచ్చారు. ఇటీవల భర్తీ చేసిన 16 వేల ఉపాధ్యాయ పోస్టుల్లో 2 వేల పోస్టులు గిరిజనులకు దక్కాయని, ఉపాధ్యాయుల ఉద్యోగ భద్రతకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. గిరిజన హక్కుల పరిరక్షణకు జీవో నెం. 3 స్ఫూర్తితో కొత్త విధానాన్ని తీసుకురావడానికి ప్రభుత్వం కృషి చేస్తోందని స్పష్టం చేశారు.

సోషల్ వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్ శాఖ కార్యదర్శి ఎం. మల్లిఖార్జున నాయక్ మాట్లాడుతూ గిరిజన విద్యార్థులు ఓపెన్ కేటగిరీ విద్యార్థులతో సమానంగా అత్యుత్తమ మార్కులు సాధించడం వారి ప్రతిభకు నిదర్శనమన్నారు. గురుకులాలు, ఆశ్రమ పాఠశాలల్లో ఉత్తీర్ణత శాతం మరింత పెంచి 90 శాతానికి పైగా తీసుకెళ్లడమే లక్ష్యమని తెలిపారు. విద్యార్థులు కమ్యూనికేషన్ స్కిల్స్ ను పెంపొందించుకుని సమాజంలో నాయకులుగా ఎదగాలని ఆకాంక్షించారు.

గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ ఎస్. భార్గవి మాట్లాడుతూ...లి రాష్ట్ర జనాభాలో 5.53 శాతం ఉన్న గిరిజనుల విద్యాభివృద్ధి కోసం బడ్జెట్‌లో రూ. 1,672 కోట్లు కేటాయించామని తెలిపారు. రాష్ట్రంలోని 2,712 గిరిజన విద్యా సంస్థల్లో 2.14 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారని, ఆశ్రమ పాఠశాలలు, గురుకులాల్లో ఉత్తీర్ణత శాతం గణనీయంగా పెరిగిందన్నారు. 29 మంది విద్యార్థులు ఐఐటీ అడ్వాన్స్ పరీక్షకు అర్హత సాధించడం విశేషమన్నారు.

**సన్మాన గ్రహీతల్లో :** ఎస్ఎస్ సి లో స్టేట్ టాపర్స్ (ట్రైబల్ వెల్ఫేర్ 18/గురుకులం 18) 36 మంది, ఎస్ఎస్ సి డిస్ట్రిక్ట్ టాపర్స్ లో ట్రైబల్ వెల్ఫేర్ నుండి 18 మంది, గురుకులం నుండి 18 మొత్తం 36 మంది, బెస్ట్ టీచర్స్/లెక్చరర్స్ (ట్రైబల్ వెల్ఫేర్ 7/గురుకులం 18) 25 మంది, బెస్ట్ హెడ్మాస్టర్స్/ప్రిన్సిపల్స్ (ట్రైబల్ వెల్ఫేర్ 4/గురుకులం 8) 12 మంది, బెస్ట్ హెచ్ డబ్ల్యుఓఎస్. (ట్రైబల్ వెల్ఫేర్ ) 6 గురు, ఇంటర్మీడియట్ స్టేట్ ఆఫర్స్ (ట్రైబల్ వెల్ఫేర్ 14/ గురుకులం 12) 26 మంది, ఇంటర్మీడియట్ డిస్ట్రిక్ట్ టాపర్స్ (ట్రైబల్ వెల్ఫేర్ 15/గురుకులం 10) 25 మంది, ఐఐటీ/జేఈఈ ఎచీవర్స్ ( గురుకులం ) 5 గురు, స్పెషల్ అవార్డ్స్ (ట్రైబల్ వెల్ఫేర్) 5 గురు ఉండగా మొత్తం 176 మంది అందుకున్నారు.

అవార్డులు ప్రదానానంతరం మంత్రి గుమ్మిడి సంధ్యారాణి విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమం లో విదార్థులు చెప్పిన పలు విషయాలను తెలుసుకుని పలు సూచనలు అందించారు. కార్యక్రమంలో ట్రైకార్ ఎండీ మణికుమార్, గిరిజన సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ (విద్యా సంబంధం) ప్రతిభా భారతి, ఏడీ సరస్కతి, గిరిజన సంక్షేమ, గురుకుల సంక్షేమ శాఖ అధికారులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# మ్యూల్ ఖాతాల ముసుగులో సైబర్ నేరాలకు సహకారంఐదుగురు నిందితుల అరెస్ట్




**-రూ.8.18 కోట్ల లావాదేవీల గుర్తింపు**

**-డబ్బు ఆశతో బ్యాంకు ఖాతాలు ఇతరులకు అప్పగించవద్దు: జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల**

**నిర్మల్ జిల్లా, జూన్ 05 (జర్నలిస్ట్ ఫైల్) :** సైబర్ నేరగాళ్లకు తమ బ్యాంకు ఖాతాలు, ఏటీఎం కార్డులు, చెక్‌బుక్స్, ఇంటర్నెట్ బ్యాంకింగ్ వివరాలు అప్పగించి ఆన్‌లైన్ మోసాలకు సహకరించిన ఐదుగురు నిందితులను నిర్మల్ పోలీసులు అరెస్టు చేశారు. లోకేశ్వరం, సోన్ మండలాలకు చెందిన ఈ నిందితుల ఖాతాల ద్వారా సుమారు రూ. 8.18 కోట్లకు పైగా లావాదేవీలు జరిగినట్లు విచారణలో వెలుగులోకి వచ్చినట్లు జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల వెల్లడించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, నిందితులు 2024 సంవత్సరం నుంచి తమ పేర్లతో పాటు వ్యాపార సంస్థల పేర్లపై వివిధ బ్యాంకుల్లో కరెంట్ ఖాతాలు ప్రారంభించారు. అనంతరం ఆ ఖాతాలకు సంబంధించిన ఏటీఎం కార్డులు, చెక్‌బుక్స్, ఇంటర్నెట్ బ్యాంకింగ్ వివరాలను సైబర్ నేర ముఠాలకు అప్పగించారు. దేశంలోని పలు రాష్ట్రాల్లో అమాయక ప్రజలను ఆన్‌లైన్ మోసాలకు గురిచేసి అక్రమంగా సంపాదించిన డబ్బును ఈ ఖాతాల ద్వారా స్వీకరించి, తదుపరి ఇతర ఖాతాలకు బదిలీ చేస్తూ నేరగాళ్లు డబ్బు జాడను మాయం చేస్తున్నట్లు విచారణలో తేలింది. ఇందుకు ప్రతిఫలంగా ఖాతాదారులు కమీషన్లు పొందినట్లు పోలీసులు గుర్తించారు. విచారణలో నిమ్మ గజేందర్‌పై 9, మగ్గిడి నవీన్‌పై 28, మగ్గిడి మహేందర్‌పై 5, మేకల నిఖిల్‌పై 16, షికారి సాయి కృష్ణపై 6 సైబర్ ఫిర్యాదులు నమోదైనట్లు వెల్లడైంది. వీరి బ్యాంకు ఖాతాల విశ్లేషణలో భారీ మొత్తంలో నగదు లావాదేవీలు జరిగినట్లు బయటపడింది. నిమ్మ గజేందర్‌కు చెందిన ఆర్వీ ట్రేడర్స్ ఖాతా ద్వారా రూ. 2.69 కోట్లు, మగ్గిడి నవీన్‌కు చెందిన అజాన్ ట్రేడర్స్ ఖాతా ద్వారా రూ. 2.11 కోట్లు, మగ్గిడి మహేందర్‌కు చెందిన ఎన్‌ఆర్ ఎంటర్‌ప్రైజెస్ ఖాతా ద్వారా రూ. 91.36 లక్షలు, మేకల నిఖిల్‌కు చెందిన హెచ్‌ఆర్ ఆటోమొబైల్స్ హార్డ్‌వేర్ అండ్ ఎలక్ట్రికల్స్ ఖాతా ద్వారా రూ. 1.18 కోట్లు, షికారి సాయి కృష్ణకు చెందిన హెచ్‌ఎన్ ఎంటర్‌ప్రైజెస్ ఖాతా ద్వారా రూ. 1.28 కోట్ల లావాదేవీలు జరిగినట్లు పోలీసులు గుర్తించారులోకేశ్వరం మండలానికి చెందిన ముగ్గురు నిందితులను ఇప్పటికే అరెస్టు చేసి న్యాయస్థానం ఎదుట హాజరుపరచగా, సోన్ మండలానికి చెందిన మరో ఇద్దరిని కూడా అదుపులోకి తీసుకున్నారు. వీరికి సంబంధించిన ఇతర బ్యాంకు ఖాతాలు, సైబర్ నేర ముఠాలతో ఉన్న సంబంధాలు, కమీషన్ చెల్లింపులు, డిజిటల్ ఆధారాలపై మరింత లోతైన విచారణ కొనసాగుతోందని ఎస్పీ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, డబ్బు ఆశతో తమ బ్యాంకు ఖాతాలు, ఏటీఎం కార్డులు, చెక్‌బుక్స్, మొబైల్ నంబర్లు, ఇంటర్నెట్ బ్యాంకింగ్ వివరాలను ఇతరులకు అప్పగించవద్దని ప్రజలకు సూచించారు. అలాంటి చర్యలు సైబర్ నేరాలకు సహకరించినట్లుగా పరిగణించబడతాయని హెచ్చరించారు అనుమానాస్పద సైబర్ కార్యకలాపాలు గమనించిన వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేయాలని లేదా సైబర్ నేరాల పోర్టల్‌లో ఫిర్యాదు నమోదు చేయాలని సూచించారు. ఈ కేసును ఛేదించడంలో విశేష కృషి చేసిన భైంసా అదనపు ఎస్పీ సాయి కిరణ్, నిర్మల్ డీఎస్పీ శ్రీనివాస్, ముధోల్ ఇన్‌స్పెక్టర్ రవీందర్ నాయక్, సోన్ ఇన్‌స్పెక్టర్ గోవర్ధన్ రెడ్డి, సైబర్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్ వెంకట రమణ, ఎస్‌ఐలు గోపి, అశోక్‌తో పాటు పోలీసు సిబ్బందిని జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు

# పర్యావరణ పరిరక్షణపై విద్యార్థుల్లో చైతన్యం పెంపొందించాలి



**నిర్మల్ జిల్లా, జూన్ 05 (జర్నలిస్ట్ ఫైల్) :** ప్రజా పాలన,ప్రగతి ప్రణాళికలో భాగంగా చేపట్టిన 99 రోజుల కార్యాచరణ కార్యక్రమంలో భాగంగా గురువారం నిర్మల్ జిల్లా అటవీ కార్యాలయంలో "వ్యర్థాలను తగ్గిద్దాం -- ప్రకృతిని కాపాడుదాం" అనే అంశంపై వ్యాసరచన, చిత్రలేఖన పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. వేసవి సెలవులు కొనసాగుతున్నప్పటికీ పర్యావరణ పరిరక్షణ పట్ల ఉన్న అవగాహన, ఆసక్తితో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొనడం అభినందనీయమని జిల్లా అటవీ అధికారి సుశాంత్ సుఖ్ దేవ్ బోబడే పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత అని అన్నారు. ప్రకృతిని సంరక్షించడం ద్వారా భావితరాలకు ఆరోగ్యకరమైన, సురక్షితమైన వాతావరణాన్ని అందించవచ్చని తెలిపారు. చిన్న వయస్సు నుంచే విద్యార్థుల్లో పర్యావరణ చైతన్యం పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని చెప్పారు.ార్యక్రమంలో నాగిని భాను, రామకృష్ణారావు, నజీర్ ఖాన్, సంతోష్, వెన్నెల, సుజాత తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణ అవసరాన్ని వివరించి, ప్రకృతిని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యత నిర్వర్తించాలని సూచించారు

# మండలంలో వివిధ గ్రామాలలో గ్రామసభల ఏర్పాటు. ఎంపీడీవో



**పెగడపల్లి, జూన్ 05 (జర్నలిస్ట్ ఫైల్) :** జగిత్యాల జిల్లా పెగడపల్లి మండలం లో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా మండలంలోని నామాపూర్,నరసింహుని పేట, ఐతుపల్లి, మ్యాక వెంకయ్య పల్లి,నందగిరి గ్రామ పంచాయతీలలో గురువారం రోజున గ్రామ సర్పంచ్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఆధ్వర్యంలో గ్రామ సభలను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. గ్రామ సభలలో ఏడు అంశాలపై చర్చించడం జరిగిందని, వర్షాకాలం నేపథ్యంలో ముందస్తు చర్యలు, గ్రామప్రజలకు సురక్షిత త్రాగునీరు, ఘన వ్యర్థముల నిర్వహణ, జల సంరక్షణ, వన సంరక్షణ, మొక్కల పెంపకం వనమహోత్సవం, వరద నిర్వహణ, భద్రత ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ వివిధ అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి ప్రేమ్ సాగర్, మండల పంచాయతీ అధికారి శశి కుమార్ రెడ్డి, సర్పంచ్ లు సంధి రాజమణి-మల్లారెడ్డి, జీల రాకేష్, రజిత-రమణాకర్, అంజమ్మ- మల్లయ్య, రజిత- సురేష్, ఉప సర్పంచులు, సంబంధిత అధికారులు, గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

**-సీడీపీఓ స్వరుపరాణి**



**తాండూర్, జూన్ 05 (జర్నలిస్ట్ ఫైల్) :** ప్రపంచ పర్యావరణ దినోత్సవంలో భాగంగా గురువారం మాదారం సెక్టార్ పరిధిలోని , రెచిని రోడ్ ఏరియా అంగన్‌వాడీ కేంద్రాన్ని సీడీపీఓ స్వరుపరాణి సందర్శించారు. ఈ సందర్భంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని అమ్మ పేరుతో ఒక్క చెట్టు' కార్యక్రమంలో భాగంగా సీడీపీఓ సిబ్బందితో కలిసి అంగన్‌వాడీ కేంద్రం ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, చెట్లు పెంచడం ద్వారా భవిష్యత్ తరాలకు మేలు చేసినట్లవుతుందని సూచించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ డి. రమాదేవి, అంగన్‌వాడీ టీచర్ విజయలక్ష్మి, హెల్పర్ మగ్దూమ్ పాల్గొన్నారు

# వడదెబ్బ తో వ్యక్తి మృతి



**దమ్మపేట, జూన్ 05 (జర్నలిస్ట్ ఫైల్) :** అశ్వారావుపేట నియోజకవర్గం దమ్మపేట మండలం జమేదర బంజర గ్రామ నివాసి సున్నం భద్రయ్య(52) వ్యవసాయ కూలి రెండు రోజుల నుండి నీరసం, తీవ్ర విరేచనాలతో బాధపడుతూ గురువారం ఉదయం తెల్లవారు జామున వడదెబ్బతో మరణించడంతో కుటుంబ సభ్యులలో, గ్రామంలో విషాదఛాయలు నెలకొన్నాయి. వారికి భార్య,ఇద్దరు కుమారులు ఉన్నారు .ప్రభుత్వం ఆదుకోవాలని వారు కోరుతున్నారు

## వడ్లగూడెం లో "ప్రజా పాలన -ప్రగతి ప్రణాళిక "గ్రామ సభ



**దమ్మపేట, జూన్ 05 (జర్నలిస్ట్ ఫైల్) :** దమ్మపేట మండలం వడ్లగూడెం గ్రామం లో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా గురువారం గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ అభివృద్ధి, త్రాగునీరు, డ్రైనేజీ వ్యవస్థ మెరుగుదల, ప్లాస్టిక్ నియంత్రణ పై చర్చించారు. వర్షాకాలన్నీ దృష్టిలో ఉంచుకొని ముందస్తు చర్యలు చేపట్టాలి అని తీర్మానించారు. ఈ కార్యక్రమం లో వడ్లగూడెం గ్రామ సర్పంచ్ సున్నం జయమ్మ, ఉపసర్పంచ్ నూనె నాగ శ్రీనివాస్ రావు,గ్రామ సెక్రటరీ మురళి మరియు వార్డు మెంబర్లు,అంగన్వాడీ కార్యకర్తలు, గ్రామ జి,పి,ఓ,గ్రామ ప్రజలు పాల్గొన్నారు

# యూజీడీ పనులను త్వరగా పూర్తి చేయాలి:పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ



**శేరిలింగంపల్లి, (జర్నలిస్ట్ ఫైల్) :** శేరిలింగంపల్లి నియోజకవర్గం మాదాపూర్ డివిజన్ పరిధిలోని హనుమాన్ నగర్ కాలనీలో రూ. 38 లక్షల అంచనా వ్యయంతో చేపడుతున్న భూగర్భ డ్రైనేజీ నిర్మాణ పనులను గురువారం పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ జలమండలి, సీఎంసీ ఇంజనీరింగ్ విభాగం అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీలో డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేలా చర్యలు చేపట్టామని, పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. నిర్మాణ పనుల వల్ల కాలనీ వాసులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, యూజీడీ పనులు పూర్తయిన వెంటనే రోడ్డు పనులను ప్రారంభించి ప్రజల ప్రయాణాన్ని సుఖవంతం చేయాలని సూచించారు. ఏ చిన్న సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే తప్పకుండా పరిష్కరిస్తానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జలమండలి డీజీఎం నరేందర్, సీఎంసీ ఇంజనీరింగ్ డీఈ దుర్గ ప్రసాద్, ఏఈ సరిత, నాయకుడు ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, కాలనీ వాసులు పాల్గొన్నారు

# ద్వారకాపూర్‌లో ప్రత్యేక గ్రామసభ



**తాండూర్, జూన్ 05 (జర్నలిస్ట్ ఫైల్) :** ప్రజాపాలన-ప్రతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా తాండూర్ మండలం ద్వారకాపూర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో గురువారం సర్పంచ్ మాసాడి తిరుపతి అధ్యక్షతన ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా స్పెషల్ ఆఫీసర్ సాయిలత ప్రజలకు ఆరు కీలక అంశాలపై అవగాహన కల్పించారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియ,ప్లాస్టిక్ నిషేధం, పరిశుభ్రత, ఖరీఫ్ సీజన్‌కు విత్తనాలు, ఎరువుల లభ్యత, డ్రగ్స్ నివారణ, రోడ్ సేఫ్టీ, మహిళల భద్రతపై వివరించారు. వన మహోత్సవంలో భాగంగా మొక్కల పెంపకం ఆవశ్యకతను తెలియజేస్తూ, వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, విపత్తుల సన్నద్ధతపై ప్రజలకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కార్తిక్, వార్డు సభ్యులు, హెడ్ కానిస్టేబుల్, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

## స్వర్గీయ గాజుల లీలాకుమారికి
# ఆకుల, శీలంశెట్టి తదితరుల ఘన నివాళి



ఖమ్మం, జూన్05(జర్నలిస్ట్ ఫైల్): ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం తనికెళ్లకు చెందిన మాజీ సర్పంచ్, మాజీ ఎంపీటీసీ గాజుల కృష్ణమూర్తి సతీమణి లీలాకుమారి (లీలమ్మ) గత నెల 25వతేదీన పరమపదించారు.ఈ సందర్భంగా వారి స్వగృహంలో గురువారం దశదిన కర్మకాండ జరిగింది. ఈ కార్యానికి మున్నూరుకాపు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆకుల గాంధీ, జిల్లా అధ్యక్షులు శీలంశెట్టి వీరభద్రం, నాయకులు బండి లక్ష్మీనారాయణ, యాసా సత్యనారాయణ, యాసా రోశయ్య, గడల సీతారామయ్య,గాజుల వెంకటేశ్వరరావు, గాజుల ప్రసాద్, గడల శ్రీనివాసరావు, వనం శ్రీనివాసరావు, ఆకుల ప్రశాంత్ కుమార్,ఆకుల సురేష్,తదితరులు హాజరై దివంగత లీలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతున్ని ప్రార్థించారు.ఆమె కుమారులు రాజేష్, సురేష్,నరేష్, కూతురు నిర్మల తదితర కుటుంబ సభ్యులను గాంధీ,వీరభద్రం తదితరులు పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# గ్రామీణ ప్రాంత నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడమే గిరిజన సంక్షేమ శాఖ లక్ష్యం
## జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి కమలాకర్ రెడ్డి



వికారాబాద్ జూన్ 05 (జర్నలిస్ట్ ఫైల్) : కుల్కచర్ల:గ్రామీణ నిరుద్యోగుల ఉపాధి అవకాశాలను అభివృద్ధి చేయడం చాలా ముఖ్యమని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి కమలాకర్ రెడ్డి తెలిపారు. పరిగి నియోజకవర్గం లోని కుల్కచర్ల మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ యువతకు ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పించారు. ముఖ్యంగాగ్రామీణ యువతకు నైపుణ్యాభివృద్ధి(స్కిల్ ట్రైనింగ్) నిర్వహించడం ద్వారా వారికి స్థిరమైన ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో ఈ శిక్షణలు చేపడుతున్నామన్నారు. యువత తమ ప్రతిభను మెరుగుపరుచుకుని ఉద్యోగ అవకాశాలను పొందగలరని వివరించారు. నిరుద్యోగులు



ప్రభుత్వం అందిస్తున్న వివిధ రకాల శిక్షణ,ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో యువత స్వయం ఉపాధి వైపు దృష్టి సారించాలని కూడా పిలుపు నిచ్చారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రామకృష్ణ నాయక్, గిరిజన సంక్షేమ శాఖల అధికారులు ప్రజా ప్రతినిధులు గిరిజన సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# డ్రగ్స్ సైబర్ నేరాల పట్ల రోడ్డు భద్రత హెల్మెట్ కచ్చితంగా ధరించాలి

-గున్ గల్ గ్రామసభలో సిఐ నందీశ్వర్ రెడ్డి.-గ్రామ సర్పంచ్ బాసాని బుచ్చిరెడ్డి.



ఇబ్రహీంపట్నం జూన్ 05 (జర్నలిస్ట్ ఫైల్) : యాచారం మండల పరిధిలో గురువారం గున్ గల్ గ్రామసభల అవగాహన కార్యక్రమం,గున్ గల్ గ్రామసభలో సీఐ నందీశ్వర్ రెడ్డి పాల్గొని గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు.ముఖ్యంగా హెల్మెట్ వినియోగం,డ్రగ్స్ దుష్ప్రభావాలు, సైబర్ నేరాల పట్ల జాగ్రత్తలు, రోడ్డు భద్రత నియమాలు గురించి వివరించారు.యువత,విద్యార్థులు, తల్లిదండ్రులు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని సూచించారు.మొబైల్ ఫోన్, సోషల్ మీడియా ద్వారా జరుగుతున్న సైబర్ మోసాల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు.వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ట్రాఫిక్ నియమాలను పాటించాలని సూచించారు. గ్రామ ప్రజలు, మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని సీఐ సూచనలను ఎంతో శ్రద్ధగా



విన్నారు.సీఐ ఇచ్చిన సలహాలు సూచనలను తమ జీవితంలో తప్పకుండా అమలు చేస్తామని గ్రామ ప్రజలు హామీ ఇచ్చారు.సమాజంలో శాంతి భద్రతలు, రోడ్డు భద్రత సైబర్ భద్రత కోసం పోలీసు శాఖతో సహకరిస్తామని గ్రామస్థులు తెలిపారు.అవగాహనతోనే భద్రత --భద్రతతోనే అభివృద్ధి కార్యక్రమంలో గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# చిన్న ఓదాలలో గ్రామ సభ సర్పంచ్ నాగుల శారద రాజయ్య



మంథని, జూన్ 05 (జర్నలిస్ట్ ఫైల్) : మంథని మండలం చిన్న ఓదాల గ్రామంలో గురువారం ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సర్పంచ్ నాగుల శారద రాజయ్య అధ్యక్షతనా ప్రత్యేక గ్రామ సభ నిర్వహించారు. ప్రజలందరికీ పారిశుద్ధ్యం గురించి, పొడిచెత్త తడిచెత్తా వేరువేరుగా చేసుట విధానం గురించి విద్యుత్తు అవసరాల గురించి, ఆరోగ్యం గురించి, వ్యవసాయ ప్యాడి విత్తన రకాల గురించి, ఎరువులు రసాయన మందులు తగ్గించి వాడకం గురించి అన్ని విధాల ప్రజలకు వివరించి అవగాహనగా గ్రామసభ నిర్వహించారు. ఈ యొక్క గ్రామ సభలో ఎంపిడిఓ కే.శ్రీజ రెడ్డి, ఎంపిఓ షబ్బీర్ భాషా, రెవెన్యూ డిటీ ఎలక్షన్ రాంబాబు, ఎలక్ట్రిసిటీ ఏఈ సాయి, అగ్రికల్చర్ ఏవో నవ్య, ఏఈఓ మురళి, గ్రామ సర్పంచ్ నాగుల శారద రాజయ్య, ఉపసర్పంచ్ వేముల శ్రవణ్ కుమార్, వార్డు సభ్యులు ముత్యాల లక్ష్మణ్, పల్లె హర్షణ తోపాటు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# భవిష్యత్తు తరాల కోసం పర్యావరణాన్ని కాపాడుకుందాం

: జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

- గ్రామాలలో చెత్త నిర్వహణ, పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలి
- వరదల సమయంలో ప్రజలు అధికారుల సూచనలు తప్పనిసరిగా పాటించాలి
- ప్రత్యామ్నాయ పంటల సాగు, సేంద్రీయ వ్యవసాయాన్ని ప్రోత్సహించాలి
- ఎస్.ఐ.ఆర్ కార్యక్రమంపై అపోహలను వీడి ప్రజలు సహకరించాలి
- అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే ఎస్.ఐ.ఆర్. లక్ష్యం
- ఖమ్మం రూరల్ మండలం గోళ్లపాడు గ్రామ సభలో పాల్గొన్న జిల్లా కలెక్టర్



ఖమ్మం, ఖమ్మం రూరల్, (జర్నలిస్ట్ ఫైల్) : భవిష్యత్తు తరాల కోసం మనమందరం పర్యావరణాన్ని కాపాడుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు. ఖమ్మం రూరల్ మండలం గోళ్లపాడు గ్రామంలోనీ రైతు వేదికలో నిర్వహించిన గ్రామ సభలో జిల్లా కలెక్టర్ పాల్గొని ప్రజలతో ముఖాముఖి సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ గ్రామ, వార్డు సభలు ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరవేసే ముఖ్య వేదికలని అన్నారు. ఎస్.ఐ.ఆర్ కార్యక్రమంపై సమగ్ర వివరాలు తెలియజేసి, ప్రజలు అడిగిన సందేహాలను నివృత్తి చేశారు. ఇరిగేషన్ శాఖకు సంబంధించిన కాలువల అభివృద్ధి, సాగునీటి పనుల పురోగతిపై గ్రామస్తులతో చర్చించారు. రాబోయే ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఎరువుల కొరత తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకున్నామని తెలిపారు. నానో యూరియా వినియోగాన్ని ప్రోత్సహించాలని సూచించారు.పంటల మార్పిడి విధానంపై రైతులకు అవగాహన కల్పిస్తూ, వాతావరణ శాఖ అంచనాలను దృష్టిలో ఉంచుకొని ప్రత్యామ్నాయ పంటలైన ఆయిల్‌పామ్, కూరగాయలు, పండ్ల తోటల సాగుపై దృష్టి సారించాలని సూచించారు.వర్షాభావ పరిస్థితులు తక్కువగా ఉన్న నేపథ్యంలో బోర్‌వెల్ సౌకర్యం కలిగిన రైతులు షార్ట్ డ్యూరేషన్ వరి సాగు చేపట్టవచ్చని తెలిపారు. పంటలకు రసాయన ఎరువులు, పురుగుమందుల వినియోగాన్ని తగ్గించి సేంద్రీయ వ్యవసాయానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.గ్రామాలలో చెత్తను సమర్థవంతంగా నిర్వహించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని కలెక్టర్ పేర్కొన్నారు. రోజురోజుకూ పెరుగుతున్న జనాభా నేపథ్యంలో పర్యావరణ కాలుష్యం పెరుగుతోందని, ప్రస్తుతం స్వచ్ఛమైన తాగునీటి కోసం డబ్బులు చెల్లిస్తున్నామని, భవిష్యత్తులో స్వచ్ఛమైన గాలి కోసం కూడా డబ్బులు చెల్లించాల్సిన పరిస్థితి రాకుండా పర్యావరణ పరిరక్షణకు అందరూ కృషి చేయాలని సూచించారు.భవిష్యత్ తరాలు మెరుగైన జీవనం సాగించాలంటే పర్యావరణ పరిరక్షణ అత్యంత ముఖ్యమని అన్నారు. వాతావరణ మార్పుల ప్రభావంతో ఒకేరోజు కుంభవృష్టి తరహా వర్షాలు కురిసి వరదలు సంభవిస్తున్నాయని, అడవుల నరికివేత కారణంగా కోతులు జనావాసాల్లోకి వస్తున్నాయని తెలిపారు. కోతుల సమస్యకు తక్షణ పరిష్కారం లేదని, గ్రామస్థులు తమ జీవన విధానంలో మార్పులు చేసుకుంటేనే శాశ్వత పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు.జిల్లాకు సమగ్ర విపత్తు నిర్వహణ ప్రణాళిక సిద్ధం చేయాల్సిన అవసరాన్ని వివరించిన కలెక్టర్, రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో మురుగు కాల్వల శుభ్రత, పరిసరాల పరిశుభ్రత, నీటి సంరక్షణ చర్యలు, కమ్యూనిటీ సోక్‌పిట్ల నిర్మాణం వంటి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు.వరదల సమయంలో ప్రజలు ప్రభుత్వ యంత్రాంగానికి సహకరించి లోతట్టు ప్రాంతాల నుంచి వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని సూచించారు. భారీ వర్షాల కారణంగా ఇండ్లు కూలి పోవడం, విద్యుత్ స్తంభాలు, పెద్ద చెట్లు కూలిపోవడం వంటి ఘటనలతో ప్రాణనష్టం సంభవించే అవకాశం ఉందన్నారు. రహదారులు, కల్వర్టులపై వరద నీరు ప్రవహిస్తున్న సమయంలో అధికారుల హెచ్చరికలను పట్టించుకోకుండా ప్రయాణించడం వల్ల ప్రమాదాలు జరుగు తున్నాయని తెలిపారు. ప్రమాదకర పరిస్థితుల్లో సెల్ఫీలు తీసుకోవడం కూడా ప్రాణాపాయానికి దారితీస్తుందని హెచ్చరించారు.పాతబడిన ఇళ్లలో నివసించే వారు భారీ వర్షాల సమయంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలు లేదా ఇతర సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సూచించారు. వరదల సమయంలో అనవసరంగా బయటకు వెళ్లవద్దని, విపత్కర పరిస్థితుల్లో హీరో అవ్వాలని ప్రయత్నించవద్దని హితవు పలికారు.ఎస్.ఐ.ఆర్ కార్యక్రమం ద్వారా ఓట్లు తొలగిపోతాయనే ప్రచారం పూర్తిగా అపోహ మాత్రమేనని కలెక్టర్ స్పష్టం చేశారు. స్వాతంత్ర్యం అనంతరం పలుమార్లు ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించారని, ఓటరు జాబితా శుద్ధీకరణే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని, మరణించిన వారు, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారు, డూప్లికేట్ ఓట్లు మాత్రమే తొలగిస్తామని చెప్పారు. అర్హత ఉన్న ఒక్క ఓటరు కూడా తన ఓటు హక్కును కోల్పోరని భరోసా కల్పించారు.జూన్ 25 నుంచి జూలై 24 వరకు బూత్ స్థాయి అధికారులు ఇంటింటికి వెళ్లి మిగిలిన ఓటర్లకు ఎన్యుమరేషన్ ఫారాలు అందజేస్తారని తెలిపారు. ప్రజలు తమ వివరాలను నమోదు చేసి ప్రభుత్వం గుర్తించిన 11 గుర్తింపు పత్రాల్లో ఏదో ఒక దానిని జతచేసి సమర్పించాలని సూచించారు.జూలై 31, 2026న డ్రాఫ్ట్ ఎస్.ఐ.ఆర్ ఓటరు జాబితా విడుదల చేస్తామని తెలిపారు. ప్రతి ఓటరు తన పేరు డ్రాఫ్ట్ జాబితాలో ఉందో లేదో పరిశీలించాలని, అభ్యంతరాలు, ఫిర్యాదులు, కొత్త క్లెయిమ్‌లు ఉంటే ఆగస్టు 30లోగా సమర్పించాలని సూచించారు.జూలై 1, 1987కు ముందు భారతదేశంలో జన్మించిన వారు తమ స్వీయ గుర్తింపు లేదా జనన ఆధార పత్రాలు సమర్పిస్తే సరిపోతుందని, జూలై 1, 1987 నుంచి డిసెంబర్ 2, 2004 మధ్య జన్మించిన వారు తమ పత్రాలతో పాటు తండ్రి లేదా తల్లి ఎవరి అయినా ఒకరి పత్రం సమర్పించాలని తెలిపారు.డిసెంబర్ 2, 2004 తర్వాత జన్మించిన వారు తండ్రి, తల్లి ఇద్దరి పత్రాలు సమర్పించాల్సి ఉంటుందని వివరించారు.సెప్టెంబర్ 28, 2026 నాటికి అన్ని అభ్యంతరాలు, క్లెయిమ్‌లను పరిష్కరించి, అక్టోబర్ 1, 2026న తుది ఓటరు జాబితా ను విడుదల చేస్తామని జిల్లా కలెక్టర్ వెల్లడించారు.ఈ కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ బి జ్యోతి, ఆత్మ పిడి బి.సరిత, ఏవో ఉమా నగేష్, పశువైద్యులు జగ్గులాల్ సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.



# కర్ణంగూడను జిల్లాకు ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దాలి

-జిల్లా కలెక్టర్ సి నారాయణరెడ్డి

రైతులందరూ ఫార్మర్ రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకోవాలి

- జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి ప్రజాపాలన-

-ప్రగతి ప్రణాళిక గ్రామసభలో కలెక్టర్ పిలుపు



ఇబ్రహీంపట్నం జూన్ 05 (జర్నలిస్ట్ ఫైల్) : ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా గురువారం ఇబ్రహీంపట్నం మండలం కర్ణంగూడ గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని గ్రామస్థులతో నేరుగా మమేకమయ్యారు. గ్రామాభివృద్ధి, వ్యవసాయం, పారిశుద్ధ్యం, విద్య, మౌలిక సదుపాయాలు, ఓటరు జాబితా పునర్విమర్శ తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా కలెక్టర్



మాట్లాడుతూ వాతావరణ శాఖ అంచనాల ప్రకారం ఈ ఏడాది సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని తెలిపారు. వర్షాలు ఆలస్యంగా ప్రారంభమయ్యే పరిస్థితులు ఉన్నందున రైతులు వ్యవసాయ శాఖ సూచనల మేరకు పంటల ఎంపిక చేసుకోవాలని సూచించారు. అధిక నీటి అవసరమున్న వరి సాగుపై జాగ్రత్తగా నిర్ణయం తీసుకోవాలని పేర్కొన్నారు.వర్షాకాలంలో నీటి కాలుష్యం, దోమల వ్యాప్తి, అంటువ్యాధుల నివారణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ సూచించారు. చెత్తాచెదారం పేరుకుపోకుండా గ్రామాన్ని పరిశు భ్రంగా ఉంచాలని, ప్రతి కుటుంబం ఆరోగ్య రక్షణకు సహకరించాలని కోరారు.వర్షాలు ప్రారంభమైన వెంటనే గ్రామంలో పెద్ద ఎత్తున మొక్కలు నాటాలని, ప్రతి కుటుంబం కనీసం ఒక మొక్కను సంరక్షించే బాధ్యత తీసుకోవాలని పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమని తెలిపారు.ప్రతి ఇంటిలో తడి చెత్త, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలని సూచించిన కలెక్టర్, తడి చెత్తతో సేంద్రియ ఎరువు తయారు చేయవచ్చని, పొడి చెత్తను రీసైక్లింగ్ ద్వారా తిరిగి వినియోగించవచ్చని తెలిపారు. గ్రామస్థుల అభ్యర్థన మేరకు చెత్త సేకరణ డబ్బాలను అందజేస్తామని, వాటిని సక్రమంగా వినియోగించి జిల్లాకు ఆదర్శంగా నిలవాలని కోరారు. నెల రోజుల తర్వాత గ్రామంలోని ఘన వ్యర్థాల నిర్వహణ పరిస్థితిని పరిశీలిస్తామని స్పష్టం చేశారు.గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కంపోస్ట్ యూనిట్‌ను పూర్తి స్థాయిలో వినియోగించి సేంద్రియ వ్యర్థాలను ఎరువుగా మార్చాలని సంబంధిత అధికారులకు సూచించారు. రైతులకు ఎరువుల పంపిణీ ప్రక్రియను మరింత పారదర్శకంగా, సులభతరంగా నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వం మునుగోడు నియోజకవర్గంలో పైలట్ ప్రాజెక్టును అమలు చేస్తోందని అధికారులు వివరించారు. యూరియా, డీఏపీ తదితర ఎరువులను ప్రత్యేక మొబైల్ యాప్ ద్వారా మాత్రమే అందజేయనున్నట్లు తెలిపారు.ఫార్మర్ రిజిస్ట్రేషన్‌కు యాప్‌ను అనుసంధానం చేసినందున రైతులు తప్పనిసరిగా నమోదు పూర్తి చేసుకోవాలని సూచించారు. భూమి విస్తీర్ణం, సాగు చేస్తున్న పంటల వివరాలను ఖచ్చితంగా నమోదు చేయాలని, తప్పుడు వివరాలు నమోదు చేస్తే ఎరువుల కేటాయింపులో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని హెచ్చరించారు.కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టనున్న ప్రత్యేక ఓటరు జాబితా పునర్విమర్శ కార్యక్రమంలో ప్రతి అర్హుడి పేరు నమోదు అయ్యేలా ప్రజలు సహకరించాలని కలెక్టర్ కోరారు. అవసరమైన ధ్రువపత్రాలను సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు.కర్ణంగూడ ప్రభుత్వ పాఠశాల పునఃప్రారంభానికి గ్రామస్థులు ముందుకు రావాలి గ్రామంలో మూతపడిన ప్రాథమిక పాఠశాలను తిరిగి ప్రారంభించేందుకు గ్రామస్థులు సహకరించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యతో పాటు అన్ని మౌలిక సదుపాయాలు కల్పించేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉందన్నారు. చిన్నారులను దూర ప్రాంతాలకు పంపకుండా గ్రామంలోనే విద్య అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. పాఠశాలకు అవసరమైన పాఠ్యపుస్తకాలు, నోటుబుక్కులు, అల్పాహారం, మధ్యాహ్న భోజనం తదితర సౌకర్యాలు అందుబాటులో ఉంటాయని తెలిపారు.డీసీపీ నారాయణ రెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో పెరుగుతున్న వాహనాల సంఖ్యకు అనుగుణంగా ప్రజలు మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. తాగి వాహనం నడపడం, ట్రిపుల్ రైడింగ్ వంటి ప్రమాదకర చర్యలకు దూరంగా ఉండాలని హెచ్చరించారు. రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువగా కుటుంబ పోషకులు ప్రాణాలు కోల్పోతున్నారని, కుటుంబ సభ్యులు భద్రతా నిబంధనలు పాటించేలా చూసుకోవాలని కోరారు. యువతలో మాదకద్రవ్యాల వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గ్రామాల్లో గంజాయి లేదా ఇతర మాదకద్రవ్యాల వినియోగం గమనిస్తే వెంటనే డయల్-100 ద్వారా పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తిరుమల రెడ్డి, ఉపసర్పంచ్, జిల్లా పంచాయతీ అధికారి సురేశ్ మోహన్, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి సురేష్, మండల అధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, గ్రామ పెద్దలు, మహిళలు, రైతులు మరియు



# నిజామాబాద్ లో 'రెసోనెన్స్ ఫౌండేషన్ సెంటర్' ప్రారంభం

క్రమశిక్షణ,సరైన మార్గదర్శకత్వం విజయానికి మూలం

మాజీ ఐపీఎస్ అధికారి జేడీ లక్ష్మీనారాయణ



నిజామాబాదు జిల్లా ప్రతినిధి జూన్ 05 (జర్నలిస్ట్ ఫైల్) : క్రమశిక్షణ,సరైన మార్గదర్శకత్వం విజయానికి మూలమని మాజీ ఐపీఎస్ అధికారి జేడీ లక్ష్మీనారాయణ తెలిపారు.దేశంలో ఐఐటీ-జేఈఈ,నీట్ శిక్షణలో అగ్రగామిగా ఉన్న రెసోనెన్స్ విద్యాసంస్థలు నిజామాబాదులో ఉన్న హోటల్ వంశీ ఇంటర్నేషనల్ వేదికగా 'రెసోనెన్స్ ఫౌండేషన్ సెంటర్'ను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించింది.మాజీ ఐపీఎస్ అధికారి జేడీ లక్ష్మీనారాయణ ముఖ్య అతిధిగా హాజరై ఈ కేంద్రాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ....విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే బలమైన విద్యా పునాది నిర్మించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.నిజామాబాదులో ఫౌండేషన్ కోచింగ్ ను అందుబాటులోకి తీసుకు వస్తున్న రెసోనెన్స్ విద్యా సంస్థలను అభినందించారు.6వ తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు.ఈ సందర్భంగా రెసోనెన్స్ మేనేజింగ్ డైరెక్టర్ పూర్ణచంద్రరావు నర్రా మాట్లాడుతూ....అనుభవజ్ఞులైన అధ్యాపకులు, క్రమబద్ధమైన బోధనా పద్ధతులు, నిరంతర విద్యా పర్యవేక్షణతో ఫలితాల ఆధారిత విద్యను అందించడానికి రెసోనెన్స్ కట్టుబడి ఉందన్నారు.ఈ ఫౌండేషన్ సెంటర్ విద్యార్థులకు ప్రాథమికాంశాలను బలోపేతం చేసుకోవడానికి, ఐఐటీ -జేఈఈ, నీట్, ఒలింపియాడ్స్ వంటి పోటీ పరీక్షలకు ఆత్మవిశ్వాసంతో సిద్ధమవడానికి సహాయపడుతుందని తెలిపారు.అనంతరం నిర్వహించిన అవగాహన సదస్సులో ప్రారంభ దశలోనే ప్రిపరేషన్ మొదలుపెట్టడం, సంపూర్ణ అవగాహనతో కూడిన అభ్యాసం, కెరీర్ ఆధారిత విద్యా ప్రణాళిక ప్రాముఖ్యతను వివరించారు.



## రెసోనెన్స్ విద్యాసంస్థలు తెలంగాణ,ఆంధ్రప్రదేశ్

రెసోనెన్స్ అనేది ఐఐటీ మద్రాస్ పూర్వ విద్యార్థి ఆర్కే వర్మ 2001లో రాజస్థాన్ కోటాలో స్థాపించారు.ఇది దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన ఒక ప్రతిష్టాత్మక విద్యాసంస్థ,గత రెండు దశాబ్దాలుగా రెసోనెన్స్ 87 నగరాల్లోని 150 పైగా కేంద్రాల ద్వారా 10 లక్షల (1 మిలియన్) పైగా విద్యార్థులకు శిక్షణ ఇచ్చింది. ఇందులో 3.3 లక్షల పైగా విద్యార్థులు ఐఐటీలు, ఎన్ఐటీలు, ట్రిపుల్ ఐటీలు, ప్రముఖ సాంకేతిక విశ్వవిద్యాలయాలు,టాప్ మెడికల్ కాలేజీలలో ప్రవేశాలు పొందారు. దేశవ్యాప్తంగా ఉన్న ఈ బలమైన వారసత్వంతో, పూర్ణచంద్రరావు నర్రా దూరదృష్టితో కూడిన నాయకత్వంలో రెసోనెన్స్ 2018లో హైదరాబాద్లో ఒకే ఒక్క క్యాంపస్ ప్రస్థానాన్ని ప్రారంభించింది.ఎంపీసీ,బైపీసీ గ్రూపులపై ప్రత్యేక దృష్టి సారిస్తూ.. ఐఐటీ -జేఈఈ,నీట్, ఇతర పోటీ పరీక్షలకు సమగ్రమైన శిక్షణ, అనుభవజ్ఞులైన అధ్యాపకులు ,క్రమశిక్షణతో కూడిన ప్రిపరేషన్ ,ఫలితాల ఆధారిత విధానంతో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో నిరంతర విజయాలకు, విద్యా నైపుణ్యానికి రెసోనెన్స్ విద్యాసంస్థలు ఒక చిహ్నంగా మారాయి. కేవలం ఏడు సంవత్సరాలలోనే,రెసోనెన్స్ విద్యాసంస్థలకు చెందిన 6,100 పైగా విద్యార్థులు ఐఐటీలు, ఎన్ఐటీలు, ట్రిపుల్ ఐటీలు,ఎయిమ్స్,ఇతర అగ్రశ్రేణి విశ్వవిద్యాలయాలలో సీట్లు సాధించారు.ఈ అద్భుతమైన విజయాల స్ఫూర్తితో రెసోనెన్స్ ఇప్పుడు ఫౌండేషన్ సెంటర్లు, పాఠశాలలు, ఈ-లెర్నింగ్,గ్లోబల్ స్టడీస్ రంగాలలోకి విస్తరించింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల వ్యాప్తంగా 50 పైగా క్యాంపస్లతో విజయవంతంగా దూసుకుపోతోందన్నారు. ఈ కార్యక్రమంలో 'రెసోనెన్స్ ఫౌండేషన్ సెంటర్' అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ టీచర్స్ కోసం దరఖాస్తులు..!!

**ఆత్మకూర్ మండల విద్యాశాఖ అధికారి:**



హనుమకొండ జిల్లా ప్రతినిధి జూన్ 05(జర్నలిస్ట్ ఫైల్): హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండలంలో రెండు ప్రీ ప్రైమరీ పాఠశాలలకు టీచర్స్ కోసం ఆసక్తి కలిగిన వారు దరఖాస్తు పెట్టుకోగలరని మండల విద్యాశాఖ అధికారి ఎన్ విజయ కుమార్ గురువారం నాడు ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం ఆదేశాల మేరకు, పాఠశాల విద్యాశాఖ మరియు సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో 2026-27 విద్యా సంవత్సరానికి ఆత్మకూరు మండలంలో రెండు ప్రభుత్వ ప్రీ-ప్రైమరీ పాఠశాలలను ప్రారంభించనున్నట్లు మండల విద్యాధికారి పేర్కొన్నారు..ఎంపీపీఎస్ ఆత్మకూరు గొల్లవాడ,ఎంపీపీఎస్ పెద్దపూర్, పాఠశాలల్లో ప్రీ-ప్రైమరీ విభాగాలు . ప్రీ-ప్రైమరీ టీచర్స్ పోస్టుకు ఇంటర్మీడియట్ (10ం02) లేదా సమాన విద్యార్హత కలిగి ఉండాలని,ప్రారంభ బాల్య విద్య (ఈసీఈ) లేదా ప్రాథమిక బోధనలో అర్హతలు ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు.ఆయా పోస్టుకు కనీసం 7వ తరగతి ఉత్తీర్ణత సాధించి ఉండాలని పేర్కొన్నారు. అభ్యర్థుల ఎంపికలో మొదట హాబిటేషన్, అనంతరం గ్రామ పంచాయతీ,మండలం, జిల్లా ప్రాతిపదికన ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు.నోటిఫికేషన్ తేదీ నాటికి అభ్యర్థుల వయస్సు 18 నుంచి 44 సంవత్సరాల మధ్య ఉండాలని,ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు 5 సంవత్సరాలు,మాజీ సైనికులకు 3 సంవత్సరాలు, దివ్యాంగులకు 10 సంవత్సరాల వయో సడలింపు వర్తిస్తుందని చెప్పారు. అర్హులైన అభ్యర్థులు తమ దరఖాస్తులతో పాటు సంబంధిత ధ్రువపత్రాలను సంబంధిత ప్రీ-ప్రైమరీ పాఠశాల సంబంధిత ప్రధానోపాధ్యాయులకు ఈ నెల జూన్ 8వ తేదీలోగా సమర్పించాలని మండల విద్యాధికారి ఎన్.విజయకుమార్ కోరారు.

## జాతీయ స్థాయిలో మరో ఘనత సాధించిన ఐటిడీఏ భద్రాచలం పీవో రాహుల్...




భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, జూన్ 05 (జర్నలిస్ట్ ఫైల్) : ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో నిర్వహించిన జాతీయ పి ఓ కాన్ఫరెన్స్‌లో ఐటిడీఏ భద్రాచలం ప్రాజెక్ట్ అధికారి బి. రాహుల్ దేశంలోని ఉత్తమ ప్రాజెక్ట్ అధికారిగా ఎంపికై ప్రతిష్టాత్మక అవార్డును అందుకున్నారు.నీతి ఆయోగ్ వైస్ చైర్మన్ అశోక్ కుమార్, గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ కార్యదర్శి రంజనా చోప్రా చేతుల మీదుగా పీవో రాహుల్, ఏపీవో డేవిడ్ రాజ్‌లకు రూ.5 లక్షల ప్రోత్సాహక పురస్కారం అందజేశారు. గిరిజన మ్యూజియం, భద్రగిరి మార్ట్, ఉద్దీపకం, కెరీర్ గైడెన్స్, ఇలవేల్పుల చరిత్ర పరిరక్షణ, క్రీడల ప్రోత్సాహం వంటి కార్యక్రమాలతో పాటు ప్రభుత్వ పథకాల సమర్థ అమలుకు ఈ గుర్తింపు లభించింది.ఇప్పటికే గవర్నర్ చేతుల మీదుగా 'బెస్ట్ ఎలెక్టోరల్ ప్రాక్టీసెస్ అవార్డు', ముఖ్యమంత్రి చేతుల మీదుగా 'బెస్ట్ రూరల్ టూరిజం అవార్డు', ఆదివాసీ ఐక్య వేదిక నుంచి 'ఆదివాసీ వికాస రత్న' బిరుదు అందుకున్న రాహుల్, ఇప్పుడు జాతీయ స్థాయిలో మరో ప్రతిష్టాత్మక అవార్డు అందుకోవడం విశేషంగా నిలిచింది.ఐటిడీఏ అధికారులు, గిరిజన ప్రజాప్రతినిధులు, వివిధ వర్గాల ప్రజలు పీవో రాహుల్‌కు అభినందనలు తెలిపారు.

## రఘునాథ్ యాదవ్ కు శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్ పార్టీ ప్రముఖులు



శేరిలింగంపల్లి (జర్నలిస్ట్ ఫైల్) : శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మారబోయిన రఘునాథ్ యాదవ్ ని తెలంగాణ రాష్ట్ర యాదవ కో-ఆపరేటివ్ కార్పొరేషన్ లిమిటెడ్ చైర్మన్ గా నియమించిన సందర్భంగా వారిని మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేయడం జరిగినది. శుభాకాంక్షలు తెలియజేసిన వారిలో " శ్రామిక శక్తి అవార్డు గ్రహీత" రాష్ట్ర ఐ ఎన్ టి యు సి నాయకులు టిపిసిసి లేబర్ సెల్ తెలంగాణ రాష్ట్ర వైస్ చైర్మన్ నల్ల సంజీవరెడ్డి , టిపిసిసి లేబర్ సెల్ తెలంగాణ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి వీరమల్ల వీరేందర్ గౌడ్ , శ్రామిక శక్తి అవార్డు గ్రహీత"టిపిసిసి లేబర్ సెల్ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి, శేరిలింగంపల్లి నియోజకవర్గ ఏ- బ్లాక్ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఉయ్యూరు శ్రీదేవి , శ్రామిక శక్తి అవార్డు గ్రహీత" టీపీసీసీ లేబర్ సెల్ శేరిలింగంపల్లి నియోజక వర్గం అధ్యక్షులు మాదిరెడ్డి మోహన్ రెడ్డి , టిపిసిసి లేబర్ సెల్ గ్రేటర్ హైదరాబాద్ జనరల్ సెక్రెటరీ మియాపూర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ ముద్దంగుల తిరుపతి రంగారెడ్డి జిల్లా యూత్ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ ఎం.డి. మోసిన్ పటేల్ కాంగ్రెస్ కాంగ్రెస్ పార్టీ నాయకులు వేణుగోపాల్ రెడ్డి, కుమార్ సాగర్ తదితరులు శుభాకాంక్షలు తెలియజేశారు.

## అంగన్‌వాడీల్లో జూన్ 12 నుంచి బ్రేక్‌ఫాస్ట్ పథకం

**- చిన్నారుల పోషకాహారానికి తెలంగాణ ప్రభుత్వం మరో అడుగు**

హైదరాబాద్, జూన్ 05 (జర్నలిస్ట్ ఫైల్) :తెలంగాణ రాష్ట్రంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల పోషకాహార స్థాయిని మరింత మెరుగుపరిచే లక్ష్యంతో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా అంగన్‌వాడీల్లో జూన్ 12 నుంచి బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని ప్రారంభించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. తొలి దశలో ఆదిలాబాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో పైలట్ ప్రాజెక్ట్‌గా ఈ పథకాన్ని అమలు చేయనున్నారు.ఈ పథకం కింద అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులకు ప్రతిరోజూ ఉప్మా లేదా కిచిడీతో పాటు పాలు అందించనున్నారు.

ఇప్పటికే మధ్యాహ్న భోజనం, గుడ్లు, ఇతర పోషకాహార పదార్థాలు అందుతున్న నేపథ్యంలో ఉదయం అల్పాహారం కూడా అందించడం ద్వారా పిల్లల్లో పోషకాహార లోపాన్ని తగ్గించాలని ప్రభుత్వం భావిస్తోంది. రాష్ట్రంలో ముఖ్యంగా గిరిజన, గ్రామీణ ప్రాంతాల్లో చిన్నారుల్లో రక్తహీనత, తక్కువ బరువు, ఎదుగుదల లోపం వంటి సమస్యలను దృష్టిలో ఉంచుకుని ఈ కార్యక్రమాన్ని రూపొందించినట్లు అధికారులు చెబుతున్నారు.

ఉదయం పూట ఖాళీ కడుపుతో కేంద్రాలకు వచ్చే చిన్నారులకు పోషకాహారం అందించడం ద్వారా వారి ఆరోగ్యం, ఏకాగ్రత, శారీరక ఎదుగుదల మెరుగుపడుతుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.అయితే ప్రస్తుతం రాష్ట్రంలో నెలకొన్న తీవ్ర ఎండల నేపథ్యంలో అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రకటించిన వేసవి సెలవులను జూన్ 10 లేదా 12 వరకు పొడిగించే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోంది.

సెలవుల పొడిగింపు నిర్ణయం తీసుకుంటే బ్రేక్‌ఫాస్ట్ పథకం అమలు తేదీలో కూడా మార్పులు జరిగే అవకాశం ఉందని సమాచారం.అంగన్‌వాడీ సేవలను మరింత బలోపేతం చేయడం, చిన్నారులకు నాణ్యమైన పోషకాహారం అందించడం, బాలల ఆరోగ్య సూచీలను మెరుగుపరచడం లక్ష్యంగా ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపడుతోంది. పైలట్ ప్రాజెక్ట్ ఫలితాలను పరిశీలించిన అనంతరం రాష్ట్రంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాలకు ఈ పథకాన్ని విస్తరించే అవకాశాలు ఉన్నాయని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

# కాంగ్రెస్ ను ఎదుర్కొనే దమ్ములేక నాపై ఆరోపణలు

**అధికారం లేదనే అసహనంతో బిగాల మాట్లాడుతున్నారు..**
**కమిషన్...కరప్షన్.. కలెక్షన్ కు అలవాటు పడ్డాడు..**
**అభివృద్ధి పై చర్చకు సిద్ధం...**
**మాజీ ఎమ్మెల్యే బిగాల పై అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ ఫైర్...**



నిజామాబాద్ జిల్లా ప్రతినిధి జూన్ 05 (జర్నలిస్ట్ ఫైల్) : అవినీతి,అభివృద్ధి పై కాంగ్రెస్ పార్టీని ఎదుర్కొనే దమ్ము లేక మాజీ ఎమ్మెల్యే బిగాల గణేష్ తనపై ఆరోపణలు చేస్తున్నారని అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ తెలిపారు.జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ....గత అసెంబ్లీ ఎన్నికల్లో అర్బన్ నియోజకవర్గ ప్రజలు స్పష్టమైన తీర్పు ఇచ్చిన తర్వాత మాజీ ఎమ్మెల్యే బిగాల నగరానికి ఎప్పుడో ఒకసారి వస్తున్నారన్నారు.అధికారం కోల్పోయిన తర్వాత అసహనంతో అవగాహన లేకుండా తనపై ఆరోపణలు చేస్తున్నాడని విమర్శించారు.ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లోను 60 స్థానాల్లో ఒకటే సీటును గెలుపొంది,కనీసం ఆ ఒక్క సీటును కూడా కాపాడుకోలేని అసమర్థత నాయకుడు అని ఆరోపించారు.తాను గెలిచిన తర్వాత గతంలో ఉన్న పెండింగ్ పనులపై అధికారులు మంత్రుల దృష్టికి తీసుకెళ్లి వాటిని అభివృద్ధి పరచడానికి కృషి చేస్తున్నానన్నారు.ఇది జీర్ణించుకోలేని బిగాల అనవసర ఆరోపణలు చేస్తున్నారని చెప్పారు.బిగాల పదేళ్లు అధికారంలో ఉన్నా..అర్బన్ నియోజకవర్గంలో ఒక్క డబుల్ బెడ్ రూమ్ కూడా ఇప్పించలేదని గుర్తు చేశారు.గత ప్రభుత్వంలో గృహ నిర్మాణ శాఖ మంత్రిగా ప్రశాంత్ రెడ్డి ఉన్నాడని,ఆయనకు రాజీనామా చేయమని ఎందుకు అడగలేదని ప్రశ్నించారు.అలాగే ప్రతిష్టాత్మకంగా నిర్మించిన టీ హబ్ లో ఒక్క ప్రముఖ కంపెనీ కూడా తీసుకు రాలేదని మరి కేటీఆర్ ని రాజీనామా చేయమని నిలదీశావా అని ప్రశ్నించారు.కేవలం ఆర్థికంగా అభివృద్ధి చెందడానికే పని చేశావే తప్ప..నిజామాబాద్ అభివృద్ధికి కాదని ఎద్దేవా చేశారు.కమిషన్ కరప్షన్ కలెక్షన్ కు అలవాటు పడి పదేళ్లు పాలించాడని విమర్శించారు.ఇటీవల తాను మంత్రులపై ఒత్తిడి తేవడంతో నగరంలో 396 ఇల్లు కేటాయించారన్నారు.అలాగే మరో వారంలో నగర అభివృద్ధిపై సీఎం రేవంత్ రెడ్డి ని కలుస్తున్నట్లు తెలిపారు.ఇటీవల నగరంలోని మినీ ట్యాంకుబండ్ పై బిగాల గణేష్ గుప్తా అవగాహన లేకుండా ఆరోపణలు చేస్తున్నాడని చెప్పారు.ట్యాంక్ బండ్ కాంట్రాక్టర్ సమయం ముగియడంతో తాళాలు వేసి వెళ్లారన్నారు.కొత్త కాంట్రాక్టర్ నియమంచాల్సిన బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వం,కార్పొరేషన్ పై ఉందన్నారు.అదే మినీ ట్యాంక్ బండ్ పై ఏర్పాటుచేసిన చెట్లలో అవినీతికి పాల్పడ్డ చరిత్ర బిగాలది అన్నారు.నాలుగున్నర వేల ఒక్కో చెట్టును 45 వేలుగా చూయించి దోచుకున్నారన్నారు.అలాగే కార్పొరేషన్ లో ఒక్క మనిషి విధులు నిర్వహించుకున్నా..330 మంది పనిచేస్తున్నట్లు రికార్డుల్లో చూయించి నెలకు 50 లక్షలు దోచుకున్నారన్నారు.

### చర్చకు సిద్ధం....

ఏ శాఖలో అయినా తాను ఒక్కరూపాయి అవినీతి చేసినట్లు నిరూపిస్తే బహిరంగ చర్చకు సిద్ధమని ఎమ్మెల్యే సవాల్ విసిరారు.నగరంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో గల గణపతి ఆలయం ముందుకు తాను వస్తానని చెప్పారు.తన హయాంలో ఒక్క గుంట భూమి కొనుగోలు చేయలేదని,బిగాల మాత్రం ఒక్క గుంట కూడా విడిచిపెట్టలేదన్నారు.అలాగే ఆర్యవైశ్యులు అంటే దానధర్మాలకు ప్రతిక అని,కానీ బిగాల మాత్రం ఇందుకు విరుద్ధంగా ఉన్నాడన్నారు.సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి స్రవంతి రెడ్డి బిజెపి ఫ్లోర్ లీడర్ ప్రమోద్,డిప్యూటీ ఫ్లోర్ లీడర్జ్యోతి,కార్పొరేటర్లు చింతకాయల రాజేందర్,మఠం పవన్,బంటు ప్రీతి ప్రవీణ్,బొబ్బిలి సువర్ణ వేణుగోపాల్,కల్పే అర్చనా చిరంజీవి,మమత శివ,సీనియర్ నాయకులు న్యాలం రాజు,పుట్ట వీరేందర్,బీజేవైఎం రాష్ట్ర కో కార్యదర్శి విజయ్,ఇల్లెందుల ప్రభాకర్,గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ బిల్డర్స్ ఫెడరేషన్ కార్యనిర్వాహక వర్గం అత్యవసర సమావేశం



శేరిలింగంపల్లి (జర్నలిస్ట్ ఫైల్) : తెలంగాణ బిల్డర్స్ ఫెడరేషన్ కార్యనిర్వాహక వర్గము తేది 3 -6- 2026 అత్యవసర సమావేశము నిర్వహించింది. ఈ సమావేశంలో ప్రస్తుతం నిర్మాణదారులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను కూలంకుషంగా చర్చించారు. అసోసియేషన్ ప్రెసిడెంట్ సి.ప్రభాకర్ రావు సభ్యులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రస్తుత మార్కెట్లో సెంట్రింగ్ కార్మికుల రేట్లు వ్యవహారంలో సెంట్రింగ్ కార్మికులు సైట్లు దగ్గరికి వచ్చి బిల్డర్స్ అసోసియేషన్ రేట్లు పెంచినట్లుగా చెబుతూ వారి యొక్క అగ్రిమెంట్ పేపర్లు పట్టుకుని అందరూ సంతకం పెట్టాలని కోరుతున్నట్లుగా తమ దృష్టికి వచ్చినట్టుగా అసోసియేషన్ సభ్యులకు తెలియపరిచారు. వారు మాట్లాడుతూ హైదరాబాదులోని ఏ అసోసియేషన్స్ అనగా క్రెడాయ్ , నేరేడుకో అలాగే టి.బి.ఎఫ్ ప్రతినిధులు ఎవరు కూడా రేట్లు పెంచినట్టుగా ఎక్కడ ఎవరికి చెప్పి ఉండలేదని తెలియపరిచారు. ప్రస్తుతం మార్కెట్ పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని సెంట్రింగ్ కాంట్రాక్టర్ల రేట్లు పెంపుని వ్యతిరేకిస్తూ, సెంట్రింగ్ కాంట్రాక్టర్ల మిగిలిన కోరికలు అయిన హెల్త్ కార్డు విషయంలో కానీ ఈ.ఎస్.ఐ వ్యవహారంలో కానీ అదేవిధంగా కార్మికులకు ఏమైనా ప్రమాదం జరిగినప్పుడు ప్రభుత్వం నుంచి పొందే ఏదైనా ఎక్స్గ్రేషియా విషయంలో కానీ అన్ని అసోసియేషన్లు కార్మికులకి అండగా ఉండి చేయూతనందిస్తామని తెలియపరిచారు. ప్రస్తుత రేట్లు పెంపుదల అనేది ఎవరి వ్యక్తిగతం వారిది కానీ అసోసియేషన్లు ఎవరికి ఎటువంటి బాధ్యత లేదని నచ్చిన వాళ్ళు వాళ్లకు తోచిన రేటు పెంచి వారి యొక్క కాంట్రాక్టర్ తో మాట్లాడుకోవాల్సిందే గాని ఏ ఒక్క అసోసియేషన్ పెంపును సమర్థించలేదని తెలియపరిచారు. అదేవిధంగా ఎవరైనా సెంట్రింగ్ కాంట్రాక్టర్ల ప్రతినిధులు సైట్ల వద్దకు వచ్చి ఇబ్బంది పెట్టడానికి ప్రయత్నం చేస్తే వారి మీద క్రిమినల్ కేసులు పెట్టడానికి కూడా అసోసియేషన్ సభ్యులు వెనుకాడరని అన్నారు. అదేవిధంగా ప్రస్తుతం బిల్డర్స్ ఎదుర్కొంటున్న అతి ముఖ్యమైన సమస్య అయినా ట్రాన్స్ఫార్మర్ వ్యవహారం మీద కూడా అసోసియేషన్ ప్రెసిడెంట్ ప్రభాకర్ రావు మాట్లాడుతూ ప్రభుత్వము ట్రాన్స్ఫార్మర్ వ్యవహారాల్లో తీసుకొచ్చిన మార్పుల వల్ల బిల్డర్లు ఎదుర్కొంటున్న సమస్యలు గుర్తు ఎరిగి, అదేవిధంగా ప్రస్తుతం ఎలక్ట్రిసిటీ డిపార్ట్మెంట్ వారు చేసిన మార్పుల వల్ల జరుగుతున్న ఇబ్బందులు గుర్తు ఎరిగి తక్షణము బిల్డర్లకు ట్రాన్స్ఫార్మర్స్ మరియు మీటర్లు పొందడంలో ఎదురవుతున్న సమస్యలను తదనుగుణంగా కొనుగోలుదారుల నుంచి ఎదురవుతున్న ఇబ్బందులను తక్షణం పరిష్కరించాలని, దానికోసం భవిష్యత్తు ప్రణాళికను సిద్ధం చేసుకుందామని సభ్యులను కోరడం జరిగింది. అదేవిధంగా ప్రస్తుతం ప్రభుత్వము ప్రతిపాదించిన మార్కెట్ విలువల పెంపు గూర్చి మాట్లాడుతూ ల్యాండ్స్ రేట్లు పెంచడంలో ఎవరికీ ఎటువంటి ఇబ్బంది ఉండదు కానీ అపార్ట్మెంట్ల , ఎస్. ఎఫ్. టి. రేట్లు విషయం లో ప్రభుత్వం పునరాలోచించాలని ప్రభుత్వాన్ని కోరారు. ముఖ్యంగా ఎస్ ఎఫ్ టి రేట్లు పెరగడం వలన కొనుగోలుదారుడు మీద అధిక భారం స్టాంప్ డ్యూటీ అదే విధంగా జిఎస్టి రూపంలో పడుతుందని అందువల్ల కొనుగోలుదారునికి ఇబ్బంది కలగకుండా ఉండే విధంగా లోగడ రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వం హయాంలో చేసిన విధంగా ఎఫర్డబుల్ హౌసింగ్ స్కీమ్ కింద స్టాంప్ డ్యూటీ లో తగ్గుదల చేయాలని అదేవిధంగా మహిళల పేరు మీద రిజిస్ట్రేషన్ చేసినచో మరియొక 1% తగ్గించాలని ప్రభుత్వానికి విజ్ఞాపన పత్రం ఇవ్వాలని ప్రతిపాదించారు. చిన్న బిల్డర్స్ యొక్క మనుగడ కోసం ప్రభుత్వం తక్షణం కార్యాచరణ రూపొందించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం కొన్ని ప్రాంతాలలో 22 ఏ జాబితాలో చేర్చిన భూములను మరొక్కసారి సరిచూసి, లోగడ జిహెచ్ఎంసి గాని హెచ్ఎండిఏలు ద్వారా కానీ వేసిన లేఔట్లలో ఫ్లాట్స్, అదేవిధంగా బిల్డింగ్ పర్మిషన్లు తీసుకుని కన్స్ట్రక్షన్ చేసి ఆక్యుపెన్సి సర్టిఫికెట్లు పొందిన బిల్డింగుల ను కూడా సర్వే నెంబర్ల ఆధారంగా 22 ఏ జాబితాలో చేర్చడం జరిగింది. ఈ విధంగా జరిగిన పొరపాట్లను గుర్తించి సవరణ చేయవలసిందిగా ప్రభుత్వానికి విన్నవించారు. ఈ మీటింగ్ లో ప్రగతి నగర్ బిల్డర్స్ అసోసియేషన్ ప్రతినిధులు వి. శ్రీనివాస్ , బి.రాజా రెడ్డి , నారాయణరెడ్డి , గ్రేటర్ వెస్ట్ సిటీ బిల్డర్స్ అసోసియేషన్ ప్రతినిధులు మిరియాల రాఘవరావు , కే.రాజారెడ్డి , పి.బి.ఎస్. విశ్వనాధ్ ,సమ్మెట ప్రసాద్ , శశిధర్ రెడ్డి , స్వప్న శ్రీనివాస్ ,ఉప్పల్ అసోసియేషన్ ప్రతినిధులు ఆకుల సత్యనారాయణ , ఎస్ రమేష్ , జక్కా వెంకటరెడ్డి , సి. హెచ్ మురళి , పద్మాకర్ రెడ్డి ఈస్ట్ జోన్ బిల్డర్స్ ప్రతినిధులు టి. నరసింహారావు , కూకట్పల్లి జోన్ బిల్డర్స్ అసోసియేషన్ ప్రతినిధులు కే.చక్రపాణి , బి.గోపాల్ , యోగేంద్ర సింగ్ అదేవిధంగా గ్రేటర్ ఈస్ట్ జోన్ బిల్డర్స్ టీ. విద్యాసాగర్ , మధు, రమేష్ బాబు, మోహన్ రావు , సురేష్ పాల్గొన్నారు. చిన్న బిల్డర్స్ యొక్క మనుగడ కోసం ఒక జాయింట్ యాక్షన్ కమిటీ ఏర్పాటు చేసుకుని ప్రభుత్వానికి విజ్ఞాపన పత్రాలు అందజేయాలని, ప్రభుత్వానికి ఎంతో ఆదాయాన్ని సమకూరుస్తున్న నిర్మాణ రంగాన్ని కాపాడవలసిందిగా ప్రభుత్వాన్ని కోరుతూ, తదనగుణంగా భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామని ప్రతినిధులు చెప్పారు. ప్రభుత్వం చిన్న బిల్డర్లు ఎదుర్కొంటున్న చిన్న చిన్న సమస్యలను తక్షణంపరిష్కరించ వలసిందిగా కోరుకుంటూ లేనియెడల నిర్మాణాలను తాత్కాలికంగా నిలిపివేస్తూ వారి యొక్క నిరసన తెలియజేయడానికి కూడా కార్యాచరణ రూపొందిస్తామని తెలియజేశారు.

## భావి తరాలకు నష్టం వాటిల్లకుండా బాధ్యతగా వ్యవహరించాలి

**సీసీ కెమెరాల ఏర్పాటు వలన నేరాల నియంత్రణ కట్టడి చేయవచ్చు.సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడకుండా అందరూ అప్రమత్తంగా ఉండవలెను.మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలి. గ్రామ సభలో పాల్గొన్న పోలీస్ కమీషనర్**



నిజామాబాద్ జిల్లా ప్రతినిధి జూన్ 05 (జర్నలిస్ట్ ఫైల్) : మన భావి తరాలకు నష్టం జరుగకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతతో వ్యవహరించాలని పోలీస్ కమీషనర్ హితవు పలికారు.సమాజం కోసం మనం ఏం చేస్తున్నాం అన్నది ప్రతి ఒక్కరు గుర్తెరిగి బాధ్యతతో మెలగాలని సూచించారు.ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా జిల్లాలో గురువారం గ్రామ,వార్డు సభలకు శ్రీకారం చుట్టారు.మోపాల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని న్యాల్ కల్ గ్రామ సచివాలయం ప్రాంగణంలో జరిగిన గ్రామ సభకు నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా నిజామాబాదు పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య మాట్లాడుతూ....శాంతి భద్రతల పరిరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత అని గుర్తు చేశారు.శాంతియుత వాతావరణం నెలకొని ఉన్న ప్రాంతాలు సత్వర అభివృద్ధి సాధిస్తాయని అన్నారు.నేరాల నియంత్రణకు ఉపకరిస్తూ,నేరాలు జరిగిన సందర్భాలలో నిందితుల ఆచూకి తెలుసుకునేందుకు ఉపకరించే సీ.సీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని,సైబర్ నేరగాళ్ల నుండి ఎలాంటి ఫోన్ కాల్స్ వచ్చిన వారికి సంబంధించిన సమాచారం ఇవ్వకుండా సంబంధిత విలేజ్ పోలీస్ ఆఫీసర్ సంబంధించిన అధికారికి సంప్రదించగలరు లేదా వారికి విలేజ్ పోలీసు ఆఫీసర్ నంబర్ అయిన ఇవ్వగలరు.మత్తు పదార్థాలు,దురలవాట్లకు యువత దూరంగా ఉండాలని హితవు పలికారు.రోడ్ సేఫ్టీ కమిటీని ఏర్పాటు చేసుకుని రోడ్డు ప్రమాదాల నియంత్రణ కోసం కృషి చేయాలన్నారు.ఎక్కడైనా అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నట్లు గమనిస్తే వెంటనే సంబంధిత పోలీసులకు సమాచారం అందించాలని,ప్రజలకు భద్రతా కల్పించడానికి పోలీసు శాఖ ఎల్లవేళలా సమాయత్తంగా ఉంటుందని తెలిపారు.అనంతరం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి సంబంధిత శాఖల అధికారులు గ్రామస్థులకు వివరించడంతో పాటు,ప్రత్యేక ఓటరు సవరణ ప్రక్రియకు సహకరించడం,పంటల మార్పిడి,పర్యావరణ పరిరక్షణ,పరిసరాల పరిశుభ్రత,పచ్చదనం పెంపొందించాల్సిన ఆవశ్యకత,సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండడం,వర్షపు నీటిని ఒడిసిపట్టడం,భూగర్భజలాల పెంపుదల,తడి-పొడి చెత్తను వేర్వేరుగా సేకరించడం,ఘన వ్యర్థాల నిర్వహణ తదితర



అంశాలపై అవగాహన కల్పించారు.ఈ గ్రామ సభలో కలెక్టర్ ఇలా త్రిపాఠి,జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ రావు,నిజామాబాద్ ఏసిపి ప్రకాష్ యాదవ్ నిజామాబాద్ సౌత్ రూరల్ సీఐ సురేష్ కుమార్,మోపాల్ ఎస్సై జెడ్.సుస్మిత,సర్పంచ్ చంద్రకళ,వివిధ శాఖల అధికారులు,గ్రామస్తులు పాల్గొన్నారు.

## బడిబాట షార్ట్ ఫిలిమ్స్ ని విడుదల చేసిన జిల్లా అదనపు కలెక్టర్



నిజామాబాద్ జిల్లా ప్రతినిధి జూన్ 05 (జర్నలిస్ట్ ఫైల్) : జిల్లా విద్యాశాఖ నేతృత్వంలో,సమగ్ర శిక్షా సౌజన్యంతో రూపొందించిన బడిబాట షార్ట్ ఫిలిమ్స్ ని జిల్లా అదనపు కలెక్టర్ వి.భుజంగరావు విడుదల చేశారు.గురువారం జిల్లా కలెక్టరేట్లో జరిగిన ప్రత్యేక సమావేశంలో ఈ లఘు చిత్రాలను అదనపు కలెక్టర్ విడుదల చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ....నాణ్యమైన విద్య ప్రభుత్వ బడిలోనే అందుతున్నదనీ,విద్యార్థులందరినీ చేర్పించాలని,తల్లిదండ్రులకు పిలుపునిచ్చారు.అన్ని సౌకర్యాలతో ఉచితంగా అందిస్తున్న నాణ్యమైన విద్యతో ప్రభుత్వ బడులు విరాజిల్లుతున్నాయని అందుకని తల్లిదండ్రులు బాగా ఆలోచించుకొని తమ పిల్లల్ని ప్రభుత్వ బడిలోనే చేర్పించాలన్నారు.ఈ షార్ట్ ఫిలింస్ ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా విద్యాశాఖ అధికారి పి.అశోక్ మాట్లాడుతూ....బడిబాట కార్యక్రమంలో భాగంగా తల్లిదండ్రులని చైతన్యవంతుల్ని చేస్తూ,బడిలో అందుతున్న అన్ని సౌకర్యాలను వివరిస్తూ,పిల్లలందరినీ ప్రభుత్వ బడిలో చేర్పించేలా ప్రోత్సహించడానికి ఈ షార్ట్ ఫిలిమ్స్ ని రూపొందించడం జరిగిందన్నారు.ఇందులోని విషయాలను తల్లిదండ్రులు గ్రహించి తమ పిల్లలందరినీ ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలన్నారు.ఈ షార్ట్ ఫిలిమ్స్ రూపకల్పన,రచన,దర్శకత్వం వహించిన డా.కోకిల నాగరాజు ను అలాగే సహకారం అందించి,నటించిన డాక్టర్ కాసర్ల నరేష్ రావును,చింతల శ్రీనివాస్ గుప్తను,రాజశేఖర్ ను డిఇవో అభినందించారు.ఈ కార్యక్రమంలో డిసిఇబి సెక్రటరీ సీతయ్య,విద్యాశాఖ సెక్టోరియల్ అధికారులు ఎం.శ్రీధర్ రెడ్డి,పి.శ్రీనివాసరావు,బాలకృష్ణారావు,భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



## తెలుగు వర్చువల్ అకాడమీ ఏర్పాటుకు డీపీఆర్ సిద్ధం



○ తెలుగు, సంస్కృత అకాడమీ చైర్మన్ ఆర్.డి. విల్సన్ వెల్లడి

**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) :** తమిళనాడు తరహాలో తెలుగు భాషను ప్రపంచవ్యాప్తంగా విస్తరించేందుకు తెలుగు వర్చువల్ అకాడమీ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని, దీనికి సంబంధించిన డీపీఆర్ సిద్ధం చేసినట్లు రాష్ట్ర తెలుగు మరియు సంస్కృత అకాడమీ చైర్మన్ ఆర్.డి. విల్సన్ తెలిపారు. వడ్డేశ్వరంలోని అకాడమీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విదేశాల్లో స్థిరపడిన తెలుగు వారికి ఆన్‌లైన్ విధానంలో భాష నేర్పించే లక్ష్యంతో వర్చువల్ అకాడమీ ఏర్పాటు ప్రతిపాదన రూపొందించామని తెలిపారు. దీనికి సంబంధించిన డీపీఆర్‌ను మంత్రి నారా లోకేష్‌కు సమర్పించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమం విజయవంతంగా అమలు కావడానికి ప్రారంభ దశలో కనీసం రూ.100 కోట్లు కేటాయించాలని కోరినట్లు తెలిపారు.

అకాడమీ ముద్రిస్తున్న ఇంటర్మీడియట్ పుస్తకాలు బుక్‌షాపుల్లో అందుబాటులో ఉన్నప్పటికీ కొన్ని ప్రైవేట్ విద్యాసంస్థలు వాటిని కొనుగోలు చేయడం లేదని అన్నారు. ప్రభుత్వ సిలబస్ ఆధారంగా రూపొందించిన పుస్తకాలకు బదులుగా స్వంత కంటెంట్ వినియోగించడం సరికాదని పేర్కొన్నారు. 2010లో ఉమ్మడి రాష్ట్రంలో అకాడమీ పుస్తకాలు కొనుగోలు చేయాలంటూ జీవో విడుదలైందని, దానిని తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికీ అమలు చేస్తోందన్నారు. అకాడమీ కంటెంట్‌ను వినియోగిస్తూ పుస్తకాలు కొనుగోలు చేయని ప్రైవేట్ పాఠశాలలపై చర్యలకు సిఫారసు చేస్తామని తెలిపారు.

**తెలుగు సంస్కృతి పేరుతో మ్యాగజైన్**

యోజన తరహాలో "తెలుగు సంస్కృతి" పేరుతో త్వరలో మ్యాగజైన్‌ను విడుదల చేయనున్నట్లు చైర్మన్ తెలిపారు. విద్య, వైజ్ఞానిక అంశాలు, సాహిత్యం, మహిళా సాధికారత లక్ష్యాలుగా మ్యాగజైన్‌ను రూపొందిస్తున్నామని చెప్పారు.

అకాడమీలో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీ కోసం ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌కు లేఖ రాసినట్లు తెలిపారు. ఏపీపీఎస్సీ ద్వారా ఆలస్యం జరిగే పరిస్థితి ఉంటే ఇతర ప్రభుత్వ ఏజెన్సీలకు అప్పగించాలని కోరినట్లు చెప్పారు. తెలుగు మరియు సంస్కృత అకాడమీ ప్రాధాన్యతను కాపాడేందుకు చైర్మన్ పదవికి కేబినెట్ హోదా కల్పించాలని కోరారు. సంస్కృత అకాడమీ అభివృద్ధికి తిరుపతిలో ఐదు ఎకరాల భూమి కేటాయించాలని టీటీడీ చైర్మన్ బి.ఆర్. నాయుడుకు విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. భాష అభివృద్ధి కార్యక్రమాలకు తిరుమల తిరుపతి దేవస్థానం నిధులు కేటాయించాలని కోరామన్నారు. అలాగే సమగ్ర శిక్ష నుంచి అకాడమీకి రావాల్సిన పెండింగ్ నిధులను వెంటనే విడుదల చేయాలని విజ్ఞప్తి చేసినట్లు ఆర్.డి. విల్సన్ తెలిపారు.

## ఎన్ఆర్ఐ ఇంజినీరింగ్ కళాశాలలో ఘనంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం




**మేడికొండూరు (జర్నలిస్ట్ ఫైల్) :** మేడికొండూరు సమీపంలోని ఎన్ఆర్ఐ ఇంజినీరింగ్ కళాశాలలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. భారత ప్రభుత్వం కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని మై భారత్ కేంద్రం--గుంటూరు, పేస్ సొసైటీ సంయుక్తంగా కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో కళాశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పి. తిలక్ బాబు, ప్రిన్సిపాల్ డాక్టర్ డోలా సంజయ్, అడ్మిన్ మేనేజర్ బి. సీతారామయ్య, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ పి. రవికుమార్ పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు.

భావితరాలకు అందించాల్సిన గొప్ప వారసత్వం స్వచ్ఛమైన పర్యావరణమని వారు పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, వాతావరణ మార్పులు, కాలుష్యం, అటవీ నిర్మూలన వంటి సమస్యలను ఎదుర్కొనేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు.

ప్రతి సంవత్సరం జూన్ 5న నిర్వహించే ప్రపంచ పర్యావరణ దినోత్సవం ద్వారా పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన పెంచడమే లక్ష్యమన్నారు. విద్యార్థులు, యువత పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములై పరిశుభ్రత, హరిత కార్యక్రమాలు, ప్లాస్టిక్ వినియోగం తగ్గింపు వంటి అంశాలపై చైతన్యం పెంచాలని సూచించారు.

ఈ సందర్భంగా విద్యార్థులు మొక్కలు నాటి వాటిని సంరక్షిస్తామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో పేస్ సొసైటీ సెక్రటరీ పారుపల్లి రమేష్, మై భారత్ వాలంటీర్లు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన నిర్వాహకులను కళాశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పి. తిలక్ బాబు, ప్రిన్సిపాల్ డాక్టర్ డోలా సంజయ్, అడ్మిన్ మేనేజర్ బి. సీతారామయ్య అభినందించారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని కోరారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ



**మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్):** మంగళగిరి నియోజకవర్గంలోని పెనుమాక గ్రామం రజక బజార్‌కు చెందిన రావూరి సౌమ్యకు ఆరోగ్య చికిత్స నిమిత్తం మంత్రి నారా లోకేష్ చొరవతో ముఖ్యమంత్రి సహాయనిధి (జవీ=ఖీ) నుంచి మంజూరైన రూ.49,492 విలువైన చెక్కును తాడేపల్లి మండల తెలుగు దేశం పార్టీ ప్రధాన కార్యదర్శి కొల్లి శేషు, పెనుమాక గ్రామ టీడీపీ అధ్యక్షుడు పాలెపు వీరేంద్రనాథ్ (బాబి) బాధితురాలి నివాసానికి వెళ్లి అందజేశారు.

ఈ కార్యక్రమంలో రావూరి నరసింహారావు, రావూరి సీతారామయ్య, షేక్ ఖాదర్, రావూరి అయ్యప్ప, షేక్ బాజీ, కొల్లి నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలి : జీవీ

**వినుకొండ (జర్నలిస్ట్ ఫైల్):** అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం వినుకొండ మండలం అందుగుల కొత్తపాలెం గ్రామంలోని గుండ్లకమ్మ నది ఒడ్డున హిందూ ధర్మ పరిరక్షణ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన పర్యావరణ పరిరక్షణ కార్యక్రమానికి ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించే ఉద్దేశంతో ఆయన స్వయంగా సైకిల్ తొక్కుతూ అందుగుల కొత్తపాలెం గ్రామానికి చేరుకున్నారు. అనంతరం గుండ్లకమ్మ నది పరివాహక ప్రాంతంలో ప్రజలతో కలిసి మొక్కలు నాటారు.



ఈ సందర్భంగా జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ ప్రపంచ పర్యావరణ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. హిందూ ధర్మ పరిరక్షణ ట్రస్ట్, దేవాదాయ శాఖ చైర్మన్ దాసరి శ్రీనివాస్ మరియు వారి బృందం ఆధ్వర్యంలో మొక్కలు నాటడం ఆనందంగా ఉందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఇలాంటి పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలు కొనసాగించాలని, ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్క నాటి దానిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. మొక్కలు సమస్త ప్రాణికోటికి అవసరమైన ఆక్సిజన్‌ను అందిస్తాయని, మనం విడుదల చేసే కార్బన్ డై ఆక్సైడ్‌ను పీల్చుకుని వాతావరణ సమతుల్యతను కాపాడతాయని తెలిపారు. గాలి, నీరు, భూమి అత్యంత విలువైన సహజ వనరులని, వాటిని కాలుష్యం నుంచి కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపైనా ఉందన్నారు. 120 మైక్రాన్ల కంటే తక్కువ మందం ఉన్న ప్లాస్టిక్ వినియోగం భూమి కాలుష్యానికి ప్రధాన కారణమవుతోందని పేర్కొన్నారు. ఇలాంటి ప్లాస్టిక్ వ్యర్థాలు భూమిలో కరగకపోవడంతో పర్యావరణానికి తీవ్ర నష్టం జరుగుతోందని, ఆరోగ్య సమస్యలు, క్యాన్సర్ వంటి వ్యాధులకు కారణమవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలు ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి పర్యావరణ హిత ప్రత్యామ్నాయాలను ఉపయోగించాలని సూచించారు. వాగులు, కాలువలు, చెరువులు తదితర జల వనరులను కలుషితం కాకుండా కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆయన అన్నారు. నీరు ప్రాణాధారమని, భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన ప్రకృతిని అందించేందుకు అందరూ భాగస్వాములు కావాలని కోరారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా కోట్లాది మొక్కలు నాటే కార్యక్రమాలు కొనసాగుతున్నాయని తెలిపారు. శివశక్తి లీల అంజన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రానున్న ఐదేళ్లలో మొక్కల పెంపకం, కొనుగోలు, సంరక్షణ కోసం రూ.1 కోటి వ్యయం చేయనున్నట్లు ప్రకటించారు. ప్రకృతి పరిరక్షణ, వాతావరణ సమతుల్యత సాధన లక్ష్యంగా ఈ కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు. ప్రకృతిని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, పర్యావరణ పరిరక్షణలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జున రావు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## నిబంధనలు పాటించిన భవనాలకే ఆక్యుపెన్సీ సర్టిఫికెట్లు

○ నగర కమిషనర్ కె. మయూర్ అశోక్ స్పష్టం



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) :** ప్రభుత్వ నిబంధనలు, నిర్దేశిత ప్రమాణాలను పూర్తిగా పాటించిన బహుళ అంతస్తుల భవనాలకు మాత్రమే ఆక్యుపెన్సీ సర్టిఫికెట్లు మంజూరు చేస్తామని నగర కమిషనర్ కె. మయూర్ అశోక్ స్పష్టం చేశారు.

శుక్రవారం నగరంలోని బ్రాడీపేట, ఎల్ఐసీ కాలనీ, పలకలూరు రోడ్, జేకేసీ కాలేజీ రోడ్, గోరంట్ల, రామిరెడ్డి నగర్, సంతోష్ నగర్ తదితర ప్రాంతాల్లో కమిషనర్ పర్యటించారు. ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ల కోసం దరఖాస్తు చేసుకున్న భవనాలను, వివిధ అభివృద్ధి పనులను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు.

ఈ సందర్భంగా అనుమతించిన ప్లాన్‌కు అనుగుణంగా భవన నిర్మాణాలు జరిగాయా లేదా అనే అంశాలను కమిషనర్ తనిఖీ చేశారు. పార్కింగ్ స్థలం, సెట్‌బ్యాక్స్, అగ్నిమాపక భద్రతా ఏర్పాట్లు, వర్షపు నీటి సంరక్షణ గుంతలు తదితర అంశాలను పరిశీలించారు.

ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించి నిర్మించిన భవనాలకు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతులు ఇవ్వకూడదని, అన్ని ప్రమాణాలు పాటించిన భవనాలకు మాత్రమే ఆక్యుపెన్సీ సర్టిఫికెట్లు జారీ చేయాలని టౌన్ ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. అనధికార నిర్మాణాలు లేదా అనుమతించిన ప్లాన్‌కు భిన్నంగా నిర్మాణాలు ప్రారంభ దశలోనే అడ్డుకోవాలని ప్లానింగ్ కార్యదర్శులకు సూచించారు. నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత అధికారులు, పర్యవేక్షణ సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అనంతరం నగరంలోని పలు డివిజన్లలో జరుగుతున్న సీసీ రోడ్లు, డ్రైన్లు, ఇతర మౌలిక వసతుల అభివృద్ధి పనులను కమిషనర్ పరిశీలించారు. నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని, పనులు పూర్తైన వెంటనే నిర్మాణ వ్యర్థాలను తొలగించాలని సూచించారు. అభివృద్ధి పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని, డ్రైన్ల పూడికతీత పనులను నిరంతరం పర్యవేక్షించాలని ప్రజారోగ్య విభాగ అధికారులకు సూచించారు. ఈ పర్యటనలో సిటీ ప్లానర్ రాంబాబు, డీసీపీ సూరజ్ కుమార్, ఏసీపీ రెహ్మాన్, డీఈఈ రమేష్ బాబు, పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్, ప్రజారోగ్య అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

## గుంటూరు జిల్లాలో ప్రత్యేక ట్రాఫిక్ డ్రైవ్

○ 833 చలానాలు నమోదు..

○ రూ.5.01 లక్షల జరిమానా

○ 686 మందికి రోడ్డు భద్రతపై అవగాహన

**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) :** రోడ్డు భద్రతను మెరుగుపరచడం, ట్రాఫిక్ నిబంధనల అమలును కట్టుదిట్టం చేయడం లక్ష్యంగా గుంటూరు జిల్లా పోలీస్ శాఖ ప్రత్యేక ట్రాఫిక్ డ్రైవ్ నిర్వహించింది. జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ ఆదేశాల మేరకు గురువారం సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు జిల్లావ్యాప్తంగా ఈ తనిఖీలు చేపట్టారు.

జిల్లాలోని 31 బ్లాక్ స్పాట్లు, మరో 21 కీలక ప్రాంతాల్లో నిర్వహించిన ఈ ప్రత్యేక డ్రైవ్‌లో ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వాహనదారులపై 833 చలానాలు నమోదు చేసి రూ.5,01,035 జరిమానా విధించారు.



హెల్మెట్ ధరించని ద్విచక్ర వాహనదారులపై 249 కేసులు నమోదు చేసి రూ.1,03,575 జరిమానా, పిలియన్ రైడర్లు హెల్మెట్ ధరించకపోవడంపై 22 కేసులు నమోదు చేసి రూ.20,820 జరిమానా విధించారు. ట్రిపుల్ రైడింగ్‌కు సంబంధించి 195 కేసులు, ప్రమాదకర డ్రైవింగ్‌పై 57 కేసులు, రాంగ్ సైడ్ డ్రైవింగ్‌పై 13 కేసులు నమోదు చేశారు.

మొబైల్ ఫోన్ మాట్లాడుతూ వాహనం నడిపిన వారిపై 16 కేసులు నమోదు చేయగా, మద్యం సేవించి వాహనం నడిపిన 10 మందిపై కేసులు నమోదు చేశారు. ఇతర మోటారు వాహన చట్ట ఉల్లంఘనలకు సంబంధించి 281 కేసులు నమోదు చేసి రూ.1,48,135 జరిమానా విధించారు.

రోడ్డు భద్రతపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు జిల్లా వ్యాప్తంగా 15 కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల ద్వారా 225 మంది డ్రైవర్లు, 80 మంది విద్యార్థులు, 381 మంది సాధారణ ప్రజలకు ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. మొత్తం 686 మంది ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఎస్పీ వకుల్ జిందల్ మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ప్రతి పౌరుడి బాధ్యత అన్నారు. హెల్మెట్ ధరించడం, మద్యం సేవించి వాహనాలు నడపకపోవడం, డ్రైవింగ్ సమయంలో మొబైల్ ఫోన్ వినియోగించకపోవడం ద్వారా రోడ్డు ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు. ప్రజల ప్రాణ భద్రతే లక్ష్యంగా ప్రత్యేక ట్రాఫిక్ డ్రైవ్‌లు, రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమాలు జిల్లావ్యాప్తంగా కొనసాగుతాయని పోలీసులు తెలిపారు.

## రౌడీ షీటర్లు, పాత గంజాయి నేరస్తులపై ప్రత్యేక నిఘా

○ డ్రగ్ డిటెక్షన్ కిట్స్‌తో 87 మందికి పరీక్షలు.. నలుగురికి పాజిటివ్

**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) :** గంజాయి, ఇతర మత్తు పదార్థాల వినియోగాన్ని అరికట్టేందుకు గుంటూరు జిల్లా పోలీస్ శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టింది. గుంటూరు వెస్ట్ పోలీస్ సబ్ డివిజన్ పరిధిలోని పోలీస్ స్టేషన్లలో నమోదైన రౌడీ షీటర్లు, పాత గంజాయి నేరస్తులపై ప్రత్యేక నిఘా కొనసాగిస్తున్నారు.

ఈ క్రమంలో మూడు పోలీస్ స్టేషన్ల పరిధిలోని రౌడీ షీటర్లు, పాత గంజాయి నేరస్తులను ఒకేచోటకు పిలిపించి డ్రగ్ డిటెక్షన్ కిట్స్ ద్వారా యూరిన్ డ్రగ్ పరీక్షలు నిర్వహించారు. మొత్తం 87 మందికి పరీక్షలు నిర్వహించగా నలుగురికి పాజిటివ్ ఫలితాలు వచ్చినట్లు పోలీసులు తెలిపారు.

ఈ కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ పరిశీలించారు. గంజాయి లేదా ఇతర మత్తు పదార్థాలను వినియోగించిన వారిని డ్రగ్ డిటెక్షన్ కిట్స్ ద్వారా గుర్తించవచ్చని ఆయన తెలిపారు. నిందితుల వద్ద మత్తు పదార్థాలు లభించకపోయినా ఇటీవల వినియోగించారా లేదా అనే విషయాన్ని యూరిన్ పరీక్షల ద్వారా నిర్ధారించవచ్చన్నారు.



గంజాయి సేవించి దొంగతనాలు, దాడులు, ఆస్తి సంబంధిత నేరాలకు పాల్పడుతున్న వారి సంఖ్యను తగ్గించేందుకు గత ఆరు నెలలుగా ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గంజాయి కొనుగోలు, విక్రయాలు, రవాణా, నిల్వ, వినియోగానికి సంబంధించిన కేసుల్లో ఇప్పటివరకు 400 మందికి పైగా నిందితులను అరెస్టు చేసి కోర్టుల ముందు హాజరుపరిచినట్లు వెల్లడించారు.

పునరావృతంగా గంజాయి సంబంధిత నేరాలకు పాల్పడుతున్న 10 మందిపై పీడీ చట్టం కింద కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. తాజాగా డ్రగ్ పరీక్షల్లో పాజిటివ్‌గా తేలిన వారిపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, వారి నేర కార్యకలాపాలపై సమగ్ర విచారణ చేపడతామని పేర్కొన్నారు.

గంజాయి సరఫరా గొలుసును పూర్తిగా ఛేదించడమే లక్ష్యంగా నిందితులు మత్తు పదార్థాలను ఎక్కడి నుంచి సేకరిస్తున్నారు, ఎవరికి సరఫరా చేస్తున్నారు అనే అంశాలపై లోతైన దర్యాప్తు కొనసాగుతుందని తెలిపారు.

రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించి, భవిష్యత్తులో నేరాలకు దూరంగా ఉండాలని సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణ, మత్తు పదార్థాల నిర్మూలన లక్ష్యంగా ఇలాంటి తనిఖీలు, డ్రగ్ పరీక్షలు, అవగాహన కార్యక్రమాలు కొనసాగుతాయని పోలీసులు తెలిపారు.

ఈ కార్యక్రమంలో వెస్ట్ ఇన్‌చార్జి డీఎస్పీ బెల్లం శ్రీనివాస్, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ అలహరి శ్రీనివాస్, పట్టాభిపురం సీఐ గంగా వెంకటేశ్వర్లు, జిల్లా ఈగల్ టీమ్ సీఐ విక్టర్, ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో ప్రజా గ్రీవెన్స్



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) :** గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఆదేశాల మేరకు గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో క్లస్టర్ ఇంచార్జిలు ప్రజా గ్రీవెన్స్ కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుండి వినతులు, అర్జీలు స్వీకరించారు. మహమ్మద్ రఫీ, కసుకుర్తి హనుమంతరావు, గుర్రం ప్రసాద్, పరుచూరి సంజీవరావు, తన్నీరు కృష్ణ, మువ్వా వేణు బాబు, ముత్తినేని శివలీల, డా. కల్పన పాల్గొని ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు.

ప్రజలు తెలిపిన ప్రతి సమస్యను నమోదు చేసుకుని ఎమ్మెల్యే గళ్ళా మాధవి దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ఎమ్మెల్యే గళ్ళా మాధవి ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నారని వారు పేర్కొన్నారు. ప్రజా సంక్షేమం, భద్రత, సాధికారత కోసం ప్రభుత్వం మరియు ప్రజాప్రతినిధులు కట్టుబడి పనిచేస్తున్నారని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ఇలాంటి గ్రీవెన్స్ కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతాయని, ప్రజలు నిర్భయంగా తమ సమస్యలను తెలియజేయాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్‌పై అవగాహన అవసరం



○ అర్హులందరికీ ఓటు హక్కు కల్పించాలి

○ బీఎల్వోలతో సమన్వయం చేసుకోండి

○ ఎమ్మెల్యే నసీర్ ఆదేశాల మేరకు తూర్పు నియోజకవర్గ నాయకుల సమావేశం

**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) :** భారత ఎన్నికల సంఘం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని గుంటూరు తూర్పు నియోజకవర్గ కూటమి నాయకులు సూచించారు. ఎమ్మెల్యే నసీర్ ఆదేశాల మేరకు శుక్రవారం స్థానిక తూర్పు కార్యాలయంలో 2, 9 క్లస్టర్లకు చెందిన కూటమి నాయకులు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటర్ల జాబితాలో ఎలాంటి తప్పులు లేకుండా అప్ డేట్ చేయడానికి కేంద్ర ఎన్నికల సంఘం ఎస్ఐఆర్ కార్యక్రమం చేపట్టారని తెలిపారు. కూటమి నాయకులు ఎస్ఐఆర్ గురించి క్షుణ్ణంగా తెలుసుకోవాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే దీని ప్రధాన లక్ష్యమని చెప్పారు. మరణించినా, వేరే ప్రాంతాలకు శాశ్వతంగా వలస వెళ్లినా, ఒకే వ్యక్తి పేరుపై రెండు మూడు చోట్ల ఓట్లు ఉన్నా వాటిని ఓటర్ల జాబితా నుండి తొలగిస్తారని, ఇలాంటి అంశాలపై పార్టీ నాయకులు దృష్టి సారించాలని అన్నారు. ఓటరు కార్డులో పేరు, వయస్సు, చిరునామా, ఫోటోలు తప్పుగా ఉన్నా బూత్ లెవెల్ అధికారుల దృష్టికి తీసుకురావాలని చెప్పారు. బీఎల్వోలు ప్రతి ఇంటికీ వెళ్లి ఓటర్ల వివరాలను వెరిఫై చేస్తారన్నారు. వారితోపాటు పార్టీ నాయకులు కూడా ఉండాలని సూచించారు. అధికారులు ప్రతి ఇంటినీ సర్వే చేసిన తర్వాత, ఆ ఇంటి బయట ఓటరు సంఖ్య, దీూా పేరు, మొబైల్ నంబర్‌తో కూడిన ప్రత్యేక స్టిక్కర్‌ను అంటిస్తారని, ఆయా వివరాలను బూత్ లెవల్ ఏజెంట్లు తెలుసుకోవాలన్నారు. ఎస్ఐఆర్ జరుగుతున్న సమయంలో బీఎల్వోలకు సహకారం అందించాలని చెప్పారు.

## బి మఠం తహశీల్దారుగా పూర్తిస్థాయి బాధ్యతలతో కార్తీక్



○ సన్మానించిన టిడిపి నాయకులు

**బ్రహ్మంగారిమఠం (జర్నలిస్ట్ ఫైల్):** బ్రహ్మంగారిమఠం మండలానికి నూతన తహసిల్దారుగా బాధ్యతలు చేపట్టిన కార్తీక్ ను మండల తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు ముడమాల పోలిరెడ్డి, ఎస్ ఆర్ శ్రీనివాసులు రెడ్డి దుశ్శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించారు. ప్రస్తుత తహసిల్దార్ కార్తీక్ గతంలో బ్రహ్మంగారిమఠం తాసిల్దార్ కార్యాలయంలోనే ఇన్చార్జి తహసీల్దారుగా పనిచేస్తుండగానే ప్రభుత్వం ఇదే కార్యాలయం నందు పర్మినెంట్ తాసిల్దారుగా బాధ్యతలు ఇచ్చిన సందర్భంగా నాయకులు ఆయన కలిసి సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎల్ నరసింహారెడ్డి, ఆదిబోయి గురయ్య జి వెంకటరామిరెడ్డి (చిన్న) మల్లె బాలకృష్ణ, రెడ్ల దిన్నె సురేంద్ర పాల్గొన్నారు .

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక
చందాదారులుగా చేరాలని
అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

## ప్రజా సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్సీ ఆలపాటి



**తెనాలి(జర్నలిస్ట్ ఫైల్):** ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత చేరువ చేయడం, వారి సమస్యలను నేరుగా స్వీకరించి త్వరితగతిన పరిష్కరించడం లక్ష్యంగా తెలుగుదేశం పార్టీ తెనాలి నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్సీ ఆలపాటి గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఆలపాటి మాట్లాడుతూ, "ప్రజల సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ ప్రధాన ధ్యేయం. ప్రజల నుండి వచ్చిన ప్రతి వినతిని అత్యంత ప్రాధాన్యతతో పరిశీలించి సాధ్యమైనంత త్వరగా పరిష్కారం చూపేందుకు కృషి చేస్తున్నట్లు ఆయన తెలియజేశారు. ప్రజలకు పరిపాలనను మరింత చేరువ చేయడంలో PGRS కార్యక్రమం కీలక పాత్ర పోషిస్తోంది" అని ఆయన తెలిపారు. కార్యక్రమంలో జిల్లా మరియు మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, పార్టీ కార్యకర్తలు, మహిళలు, పాల్గొన్నారు.

# ప్రపంచ పర్యావరణ పరిరక్షణ బాధ్యత అందరిది : ఎమ్మెల్సీ ఆలపాటి





**తెనాలి(జర్నలిస్ట్ ఫైల్):** పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. రాష్ట్ర పార్టీ సూచనలతో తెలుగుదేశం పార్టీ కార్యాలయం నుండి పట్నంలోని రజక పేట వద్ద ఉన్న చాకలి ఐలమ్మ పార్కువరకు తెలుగుదేశం పార్టీ తెనాలి నియోజకవర్గ ఇన్చార్జి ఎమ్మెల్సీ ఆలపాటి ఆధ్వర్యంలో పర్యావరణాన్ని పరిరక్షించాలని కోరుతూ సైకిల్ ర్యాలీని తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలపాటి మాట్లాడుతూ సమాజంలో ఉన్న ప్రతి ఒక్కరు కూడా వారి బాధ్యతగా పర్యావరణాన్ని పరిరక్షించాలని కోరారు. రివర్ పర్యావరణాన్ని రక్షించాల్సిన బాధ్యత మనది కాదనే భావనతో సమాజంలో ప్రతి ఒక్కరు జీవిస్తున్నట్లు ఆయన అన్నారు. అందుకే ప్రపంచంలో ఎన్నడూ చూడని విధంగా అధికంగాఎండలు, సునామి, వంటి విపత్తులు జరుగుతున్నట్లు ఆయన తెలియజేశారు. అందుకు అవసరమైన ప్రతి ఒక్కరు కూడా చెట్లని పెంచాలని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతూ సమాజ సేవ కొరకు మానవాళి మనుగడ కొరకు భావితరాల భవిష్యత్తు కొరకు పర్యావరణాన్ని కాపాడాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన తెలియ చేశారు. పంలో పలు ప్రదేశాలలో ఎమ్మెల్సీ ఆల్ పార్టీ మొక్కలు నాటారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, మహమ్మద్ కుదూస్, హరి ప్రసాద్, మహేష్, రమాదేవి,మధు కోనేరు , కవిత, తదితరులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## పచ్చని భవిష్యత్తు కోసం బీజేపీ అడుగులు



○ బీజేపీ ఆధ్వర్యంలో "ఏక్ పేడ్ మా కే నామ్" కార్యక్రమం

**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్) :** ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా విజయవాడ గవర్నర్‌పేటలోని సీవీఆర్ ప్రభుత్వ మునిసిపల్ హైస్కూల్ ప్రాంగణంలో భారతీయ జనతా పార్టీ గవర్నర్‌పేట మండల కమిటీ ఆధ్వర్యంలో "ఏక్ పేడ్ మా కే నామ్" కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రజాస్వామ్య పాలనలో 12 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా సేవ, సుశాసన్, గరీబ్ కళ్యాణ్ లక్ష్యాలతో చేపట్టిన కార్యక్రమాల్లో భాగంగా ఈ కార్యక్రమం జరిగింది.
బీజేపీ ఆంధ్రప్రదేశ్ సంస్థాగత ప్రధాన కార్యదర్శి నూకల మధుకర్ ముఖ్య అతిథిగా పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయనతో పాటు బీజేపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు అద్దూరి శ్రీరామ్, రాష్ట్ర అధికార ప్రతినిధి షేక్ బాజీ, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు పనతాల సురేష్, మాజీ కార్పొరేటర్ నెల్లిబండ్ల బాలస్వామి, జనసేన నాయకులు సత్యం తదితరులు మొక్కలు నాటారు.
నాయకులు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని అన్నారు. ప్రకృతి సమతుల్యత కాపాడేందుకు విస్తృతంగా మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించాల్సిన అవసరం ఉందన్నారు. కాలుష్యం, వాతావరణ మార్పులు, నీటి వనరుల కొరత వంటి సమస్యలకు వృక్ష సంపద పెంపుదలే పరిష్కారమని పేర్కొన్నారు.
"ఏక్ పేడ్ మా కే నామ్" కార్యక్రమం ద్వారా ప్రతి ఒక్కరూ తమ తల్లి పేరుతో మొక్క నాటి ప్రకృతికి తమ వంతు సేవ చేయాలని పిలుపునిచ్చారు. ఒక మొక్క భావితరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించే గొప్ప ఆస్తిగా మారుతుందని తెలిపారు.
ఈ కార్యక్రమాన్ని బీజేపీ గవర్నర్‌పేట మండల అధ్యక్షులు ప్రవీణ్ జైన్ రాంకా నిర్వహించారు. పర్యావరణ దినోత్సవ ఇన్‌చార్జ్ పోతుల సాంబశివరావు, "మోదీ ప్రభుత్వం 12 సంవత్సరాలు" కార్యక్రమాల కన్వీనర్ రాయుడు శ్రీనివాస్, సహ కన్వీనర్ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.
కొల్లపల్లి గణేష్, పిట్టల గోవింద్, హేమంత్ జైన్ తదితరులు పాల్గొని మొక్కలు నాటారు. పాఠశాల ఆవరణలో నాటిన మొక్కలను నిరంతరం సంరక్షించేందుకు చర్యలు చేపడతామని నిర్వాహకులు తెలిపారు.

## 'మా కే నామ్ ఏక్ పెడ్' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

○ బీజేపీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాశ్ నారాయణ



**గుంటూరు, (జర్నలిస్ట్ ఫైల్) :** ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చిన "మా కే నామ్ ఏక్ పెడ్" కార్యక్రమాన్ని ప్రజలంతా భాగస్వాములై విజయవంతం చేయాలని బీజేపీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాశ్ నారాయణ పిలుపునిచ్చారు.
బీజేపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా పార్టీ కార్యాలయం వద్ద అమ్మ పేరుతో మొక్క నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జయప్రకాశ్ నారాయణ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ తల్లి పేరుతో కనీసం ఒక మొక్కను నాటి, దాన్ని సంరక్షించేందుకు బాధ్యత తీసుకోవాలని కోరారు.
ప్రకృతి పరిరక్షణ కేవలం ప్రభుత్వాల బాధ్యత మాత్రమే కాదని, ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత అని ఆయన అన్నారు. అభివృద్ధి పేరుతో చెట్లను విచ్చలవిడిగా నరికివేయడం వల్ల జీవ వైవిధ్యం, పర్యావరణ సమతుల్యత దెబ్బతిని భవిష్యత్‌లో మానవాళికి ముప్పు ఏర్పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.
చెట్ల పెంపకం ద్వారా వాతావరణ మార్పుల ప్రభావాన్ని తగ్గించడంతో పాటు భావితరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించవచ్చన్నారు. గత పదేళ్లలో కేంద్ర ప్రభుత్వం పునరుత్పాదక ఇంధనాలు, స్వచ్ఛ భారత్, హరితాభివృద్ధి వంటి కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇచ్చిందని తెలిపారు.
"ఒక తల్లి – ఒక చెట్టు, ఒక కుటుంబం – ఒక హరిత భవిష్యత్తు" అనే స్ఫూర్తితో ప్రతి కుటుంబం మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని ఆయన కోరారు.
జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు మాట్లాడుతూ సమస్త జీవరాశుల మనుగడకు అవసరమైన ప్రాణవాయువును అందించే చెట్లను కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రజలు చైతన్యంతో ముందుకు రావాలని కోరారు.
ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ కన్వీనర్ క్రిస్టిపాటి నారాయణరెడ్డి, కో–కన్వీనర్ విమలాదేవి, స్పైసెస్ బోర్డు డైరెక్టర్ కె.వి. సుబ్బారావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఈదర శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి దర్శనపు శ్రీనివాస్, జిల్లా సంయోజక్ భీమినేని చంద్రశేఖర్, పల్నాడు జిల్లా ఇన్‌చార్జి కొక్కెర శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి బజరంగ్ రామకృష్ణ, మహిళా మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నడ్డి నాగమల్లేశ్వరి, యువమోర్చా నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## బీజేపీ నేతృత్వంలో హరిత ఉద్యమానికి శ్రీకారం



○ ప్రకృతి పరిరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత
○ అమ్మ పేరుతో మొక్క నాటిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్

**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్) :** ప్రపంచ పర్యావరణ దినోత్సవ కార్యక్రమాల్లో భాగంగా భారతీయ జనతా పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు శుక్రవారం విజయవాడ అజిత్‌సింగ్ నగర్ మండలం 30వ డివిజన్‌లోని ట్రెండ్ సెట్ మాల్ వద్ద బీజేపీ ఆధ్వర్యంలో "ఏక్ పేడ్ మా కే నామ్" కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు అద్దూరి శ్రీరామ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో బీజేపీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అమ్మ పేరుతో మొక్కను నాటి పర్యావరణ పరిరక్షణకు పిలుపునిచ్చారు.
ఈ సందర్భంగా పీవీఎన్ మాధవ్ మాట్లాడుతూ భారతీయ సంస్కృతి, వేదాలు పర్యావరణ పరిరక్షణకు మార్గదర్శకాలని అన్నారు. ప్రకృతి–మానవ సంబంధాన్ని వేల సంవత్సరాల క్రితమే మన పూర్వీకులు గుర్తించారని పేర్కొన్నారు. ఇంట్లో ఒక శిశువు జన్మిస్తే ఆ జీవికి అవసరమైన ఆక్సిజన్ కోసం మూడు మొక్కలు నాటాలని వేదాలు సూచించాయని తెలిపారు.
అథర్వణ వేదంలోని పృథ్వీ సూక్తం భూమి పరిరక్షణ, వృక్షాల ప్రాధాన్యతను వివరిస్తుందని చెప్పారు. రావి, తులసి వంటి దేవతా వృక్షాలు పర్యావరణ సమతుల్యతకు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించిన "ఏక్ పేడ్ మా కే నామ్" కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ స్వీకరించాలని, తల్లిని ప్రేమించినట్లే మొక్కలను సంరక్షించాలన్నారు.
పర్యావరణానికి హాని కలిగించే విదేశీ జాతి మొక్క కోనోకార్పస్ సాగును ఆంధ్రప్రదేశ్‌లో నిషేధించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ మొక్కల వల్ల భూగర్భ జలాలు, స్థానిక జీవవైవిధ్యంపై ప్రతికూల ప్రభావాలు ఉంటాయని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా బీజేపీ ఆధ్వర్యంలో 10 లక్షల తాటి చెట్ల నాటే మహా ఉద్యమాన్ని చేపట్టనున్నట్లు పీవీఎన్ మాధవ్ ప్రకటించారు. శ్రీకాకుళం నుంచి తడ వరకు తీర ప్రాంతాలు, నదీ తీరాలు, చెరువు గట్ల వెంట పెద్ద ఎత్తున తాటి మొక్కలు నాటనున్నట్లు తెలిపారు. ప్రతి జిల్లాలో లక్ష తాటి టెంకలను సేకరించి కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్తామని వెల్లడించారు. తాటి చెట్టును రాష్ట్ర వృక్షంగా ప్రకటించాలని, తాటి ఆధారిత పరిశ్రమలకు ప్రోత్సాహం కల్పించాలని, ప్రత్యేక పామ్ బోర్డు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తాటి చెట్ల నరికివేతను నేరంగా పరిగణించేలా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.
కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నారెడ్డి దయాకర్ రెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి షేక్ బాజీ, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు పనతాల సురేష్, సీనియర్ నాయకులు భగవాన్ జీ, మువ్వల సుబ్బయ్య, కరినాగలక్ష్మి, చిగురుపాటి లక్ష్మి, చారుగుడి శివలలిత, పియూష్ దేశాయ్, లాకా వెంగళరావు, కొల్లపల్లి గణేష్, పిట్టల గోవిందు, బొమ్మదేవర రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

## గుంటూరులో సింపుల్ ఎనర్జీ తొలి స్టోర్ ప్రారంభం

○ సరికొత్త రీటైల్ డిజైన్ విధానంతో ఈవీ మార్కెట్ విస్తరణకు శ్రీకారం



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) :** బెంగళూరుకు చెందిన ప్రముఖ ఎలక్ట్రిక్ వాహన తయారీ సంస్థ సింపుల్ ఎనర్జీ గుంటూరులో తన తొలి స్టోర్‌ను ప్రారంభించింది. ఇటీవల లభించిన నిధుల సహకారంతో దక్షిణ భారతదేశంలో రీటైల్ వ్యాపార విస్తరణను మరింత బలోపేతం చేస్తున్న సంస్థ, కొత్త రీటైల్ డిజైన్ విధానాన్ని కూడా ఈ స్టోర్ ద్వారా తొలిసారిగా పరిచయం చేసింది.
ఆర్ఆర్ మొబిలిటీ భాగస్వామ్యంతో ఏర్పాటు చేసిన 1,170 చదరపు అడుగుల విస్తీర్ణంలోని ఈ 'సింపుల్ స్టోర్ 2.0'లో సేల్స్, సర్వీస్, స్పేర్స్ సేవలను ఒకే చోట అందించే 3ఎస్ (3ఆ) ఫెసిలిటీ అందుబాటులో ఉంది. వినియోగదారులకు మెరుగైన ఆఫ్టర్ సేల్స్ సేవలు అందించేందుకు 1,680 చదరపు అడుగుల విస్తీర్ణంలో ప్రత్యేక సర్వీస్ సెంటర్‌ను కూడా ఏర్పాటు చేశారు.
'సాధారణ ప్రజలు, అర్థవంతమైన అనుభవాలు' అనే ఆలోచనతో రూపొందించిన ఈ స్టోర్‌లో సులభమైన డిజైన్, వేగవంతమైన సేవలు, ప్రత్యేక విజువల్ అనుభవం కల్పించారు. కేవలం వాహనాల విక్రయ కేంద్రంగానే కాకుండా ఈవీ వాహనాలపై అవగాహన కల్పించే కమ్యూనిటీ హబ్‌గా కూడా ఇది పనిచేసేలా తీర్చిదిద్దారు.
ఈ స్టోర్‌లో సంస్థకు చెందిన వివిధ ఎలక్ట్రిక్ స్కూటర్ మోడళ్లు అందుబాటులో ఉన్నాయి. కొత్తగా విడుదల చేసిన 'సింపుల్ అల్ట్రా' 6.5 కిలోవాట్ బ్యాటరీతో, 400 కిలోమీటర్ల ఐడీసీ రేంజ్‌తో పాటు గంటకు 115 కిలోమీటర్ల గరిష్ఠ వేగాన్ని అందిస్తుంది. 'సింపుల్ వన్ జెన్ 2', 'సింపుల్ వన్‌ఎస్ జెన్ 2' మోడళ్లతో పాటు వివిధ యాక్సెసరీస్ కూడా వినియోగదారులకు అందుబాటులో ఉంటాయి.
ఈ సందర్భంగా సింపుల్ ఎనర్జీ ఫౌండర్, సీఈఓ సుహాస్ రాజ్‌కుమార్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ తమకు కీలక మార్కెట్ అని అన్నారు. అధిక పనితీరు, ఎక్కువ రేంజ్ కలిగిన ఎలక్ట్రిక్ వాహనాలను వినియోగదారులకు మరింత చేరువ చేయడమే లక్ష్యమని తెలిపారు.
కొత్త రీటైల్ డిజైన్ విధానం ద్వారా వినియోగదారులకు బ్రాండ్‌తో సులభమైన, మెరుగైన అనుభవం కల్పిస్తున్నామని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా వ్యాపార విస్తరణతో పాటు సర్వీస్ మౌలిక సదుపాయాలు, వినియోగదారుల అనుభవాన్ని మెరుగుపర్చడంపై సంస్థ దృష్టి సారిస్తోందని తెలిపారు.

## గుడ్డ సంచుల పంపిణీ చేసిన మంత్రి వాసంశెట్టి



**తాడేపల్లి (జర్నలిస్ట్ ఫైల్) :** ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తాడేపల్లి క్యాంపు కార్యాలయం సమీపంలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రోడ్లపై ప్రయాణిస్తున్న ప్రజలు, వినియోగదారులకు పర్యావరణానికి హాని కలగకుండా ఉండే గుడ్డ సంచులను పంపిణీ చేశారు.
ఈ సందర్భంగా మంత్రి వాసంశెట్టి సుభాష్ మాట్లాడుతూ, ప్లాస్టిక్ వినియోగం వల్ల పర్యావరణానికి తీవ్రమైన నష్టం జరుగుతోందని, భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన ప్రకృతి వాతావరణాన్ని అందించాలంటే ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్‌కు బదులుగా గుడ్డ సంచులను వినియోగించాలని పిలుపునిచ్చారు.
ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తోందని, చెట్ల పెంపకం, ప్లాస్టిక్ నిర్మూలన, పరిశుభ్రత కార్యక్రమాలను విస్తృతంగా చేపడుతోందని తెలిపారు. అలాగే యువత పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని సూచించారు. ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో పర్యావరణ హిత అలవాట్లను అలవరుచుకోవాలని, ప్లాస్టిక్ సంచులకు పూర్తిగా స్వస్తి చెప్పి గుడ్డ సంచులను వినియోగించాలని మంత్రి కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వివిటి-ఏపీలో అంతర్జాతీయ చెస్ టోర్నమెంట్‌కు మంత్రి సవిత అభినందనలు



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** ఐటి–ఏపీ యూనివర్సిటీలో నిర్వహిస్తున్న తొలి అంతర్జాతీయ ఫిడే రేటింగ్ చెస్ టోర్నమెంట్ ఐదో రోజు కార్యక్రమానికి బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్. సవిత హాజరై పోటీలను పరిశీలించారు. ఈ సందర్భంగా టోర్నమెంట్‌ను విజయవంతంగా నిర్వహిస్తున్న విట్–ఏపీ యూనివర్సిటీ యాజమాన్యాన్ని ఆమె అభినందించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ ప్రభుత్వ కార్యదర్శి ఎస్. సత్యనారాయణ పాల్గొన్నారు.
ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా పర్యావరణ పరిరక్షణ, సుస్థిర రవాణా విధానాల ప్రాముఖ్యతను మంత్రి వివరించారు. పెరుగుతున్న కాలుష్యాన్ని తగ్గించి సహజ వనరులను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఎలక్ట్రిక్ వాహనాలు, సైకిళ్ల వినియోగాన్ని పెంచడం ద్వారా హరిత భవిష్యత్తుకు బాటలు వేయవచ్చని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ప్రభుత్వం పెట్రోలియం వినియోగాన్ని తగ్గించే చర్యలను ప్రోత్సహిస్తూ పర్యావరణహిత రవాణా విధానాలను అమలు చేస్తోందని తెలిపారు. పర్యావరణ పరిరక్షణపై తన నిబద్ధతను చాటుతూ సచివాలయం నుంచి కార్యక్రమ వేదిక వరకు మంత్రి ఎలక్ట్రిక్ బైక్‌పై ప్రయాణించారు. అమరావతిలో తొలిసారిగా జరుగుతున్న ఈ చెస్ టోర్నమెంట్‌లో దేశంలోని 26 రాష్ట్రాల నుంచి దాదాపు 1,000 మంది క్రీడాకారులు పాల్గొనడం విశేషమని మంత్రి అన్నారు. ఇలాంటి ప్రతిష్టాత్మక పోటీలు అమరావతిని విద్య, క్రీడలు, ప్రతిభకు కేంద్రంగా నిలబెడతాయని పేర్కొన్నారు. చెస్ ఆట విశ్లేషణాత్మక ఆలోచన, వ్యూహాత్మక నిర్ణయ సామర్థ్యాలను పెంపొందిస్తుందని, యువతలో నాయకత్వ లక్షణాలను అభివృద్ధి చేస్తుందని తెలిపారు. విట్–ఏపీ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ పి. అరుళ్మొళివర్మన్ మాట్లాడుతూ, తొలి అంతర్జాతీయ ఫిడే రేటింగ్ చెస్ టోర్నమెంట్ నిర్వహించడం గర్వకారణమని అన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న ప్రతిభావంతులైన క్రీడాకారులు పాల్గొంటున్న ఈ పోటీలు యువతలో స్ఫూర్తిని నింపుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో విట్–ఏపీ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ జగదీష్ చంద్ర ముదిగంటి, విద్యార్థి సంక్షేమ విభాగం ఉపనిర??కులు డాక్టర్ ఖదీర్ పాషా, ఆంధ్ర చెస్ అసోసియేషన్ చైర్మన్ కె.వి.వి. శర్మ, అధ్యక్షుడు డాక్టర్ సురేష్, కార్యదర్శి జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

## యోగి ఆదిత్యానాథ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యానాథ్‌కు బీజేపీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.
ఈ సందర్భంగా పీవీఎన్ మాధవ్ ఒక ప్రకటనలో మాట్లాడుతూ యోగి ఆదిత్యానాథ్ నిరంతర శ్రమ, అభివృద్ధి పట్ల ఆయనకున్న చిత్తశుద్ధి యావత్ దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు.
ప్రజా సేవ పట్ల అంకితభావంతో పనిచేస్తూ ఉత్తరప్రదేశ్ అభివృద్ధికి యోగి ఆదిత్యానాథ్ చేస్తున్న కృషి ప్రశంసనీయమన్నారు. ఆయనకు భగవంతుడు సంపూర్ణ ఆయురారోగ్యాలు ప్రసాదించాలని, మరింత సేవ చేసే శక్తిని అందించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు తెలిపారు.

## గీత కార్మికులకు అండగా బీజేపీ : బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్

○ రాష్ట్రంలో 10 లక్షల తాటి మొక్కలు
తాటి వృక్షాల సంరక్షణకు బీజేపీ సంకల్పం



**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్) :** తాటి వృక్షాల సంరక్షణతో పాటు గీత కార్మికుల జీవనోపాధి పరిరక్షణకు బీజేపీ ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తుందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ తెలిపారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా విజయవాడలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు.
బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు రొంగల గోపి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో తాటి ఉత్పత్తులపై ఆధారపడి జీవిస్తున్న గౌడ, శెట్టి బలిజ, శ్రీశైన, యాడిగ తదితర వర్గాల సమస్యలు, వారి వృత్తి అభివృద్ధి, ఉపాధి అవకాశాలపై చర్చించారు.
ఈ సందర్భంగా పీవీఎన్ మాధవ్ మాట్లాడుతూ భారతీయ జీవన విధానంలో తాటి చెట్టుకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. ఒకప్పుడు ఆహారం, వస్త్రం, గృహ అవసరాలను తీర్చిన తాటి వృక్షాలు ప్రస్తుతం పర్యావరణ పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తున్నాయని పేర్కొన్నారు. తాటి చెట్లపై ఆధారపడి జీవిస్తున్న గీత కార్మికుల సంక్షేమానికి పార్టీ కట్టుబడి ఉందన్నారు.
రాష్ట్రవ్యాప్తంగా 10 లక్షల తాటి మొక్కలను నాటే కార్యక్రమాన్ని చేపడతామని ఆయన ప్రకటించారు. తాటి, ఈత వంటి వృక్షాల పెంపకానికి ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తున్నట్లు తెలిపారు. తాటి వృక్షాల కోసం ఫామ్ బోర్డు ఏర్పాటుపై ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లాలని సూచించారు.
నీరా ఉత్పత్తి కేంద్రాల ఏర్పాటుతో గీత కార్మికులకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని, ఆరోగ్యకరమైన ప్రత్యామ్నాయ పానీయాల వినియోగం ప్రోత్సాహం పొందుతుందని తెలిపారు. మహాత్మా గాంధీ 1922లో నీరా ఉద్యమానికి శ్రీకారం చుట్టిన విషయాన్ని గుర్తు చేశారు.
రాజ్యసభ సభ్యుడు పాకా సత్యనారాయణ మాట్లాడుతూ గీత కార్మికుల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే లక్ష్యంతో సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. గౌడ వర్గం సామాజిక, ఆర్థిక రంగాల్లో కీలక పాత్ర పోషిస్తోందని అన్నారు. తాటి ఆకులు, తాటి ఉత్పత్తులు, కల్లు సేకరణ వంటి రంగాల్లో అనేక ఉపాధి అవకాశాలు ఉన్నాయని వివరించారు.
కూటమి ప్రభుత్వం మద్యం దుకాణాల కేటాయింపులో గౌడ వర్గాలకు 10 శాతం రిజర్వేషన్ కల్పించిందని గుర్తు చేశారు. అంత్యోదయ సిద్ధాంతంతో చివరి వ్యక్తి అభ్యున్నతే బీజేపీ లక్ష్యమని తెలిపారు. వివిధ వర్గాల సమస్యల పరిష్కారానికి రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహిస్తూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పిస్తున్నట్లు నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో వాకా రామ్ గౌడ్, సుధాకర్ గౌడ్, చిట్టిబొమ్మ కిషోర్, వేముల వెంకటాచలం, వీరంకి రంగారావు, రాయలపాటి కళ్యాణి, బెల్లంకొటి సైదులు, పరాస్ రంగనాథ్, రాము గౌడ్, తెలుగుబలిజ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చొల్లంగి వేణుగోపాల్, బీసీ నాయకులు చొల్లంగి వెంకటరమణ, బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467